PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 16 | విజయవాడ, శనివారం 16 ఆగస్టు 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 16 August 2025



'ఉచిత బస్సు'తో మహిళలకు ఆర్థిక భరోసా

- డోర్ పికప్ సర్వీసుల ద్వారా ఆదాయ ఆర్జన
- 'స్త్రీ శక్తి'ని ప్రారంభించిన సిఎం చంద్రబాబునాయుడు

3



ఎర్రకోట నుంచి ప్రసంగిస్తున్న ప్రధాని మోడీ

ఆర్‌ఎస్‌ఎస్ భజన

- దీపావళి నుంచి జిఎస్‌టి 2.0 • 'మిషన్ సుదర్శన్ చక్ర' పేరిట ఆయుధ వ్యవస్థ
- రైతులకు రక్షణ కవచంగా ఉంటాం
- ఎర్రకోట నుంచి స్వాతంత్ర్య వేడుకల ప్రసంగంలో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : జాతిపితగా పరిగణించే మహాత్మా గాంధీని హత్యగావించిన సంస్థగా, మతోన్మాద సంస్థగా అనేక ఏళ్లు నిషేధానికి గురైన సంస్థగా గుర్తింపు పొందిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఫ్‌ (ఆర్‌ఎస్‌ఎస్)పై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రశంసల వర్షం కురిపించారు. భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ రాజధానిలోని ఎర్రకోట నుంచి జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో మోడీ పలు అంశాలను ప్రస్తావించారు. వందేళ్ల చరిత్ర ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ దేశంలో పౌరుల వ్యక్తిత్వ నిర్మాణంలోనూ, జాతి నిర్మాణంలోనూ విశేష సేవలందించిందని కొనియాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వేతర సంస్థ (ఎన్‌జిఒ)గా ఆర్‌ఎస్‌ఎస్ గుర్తింపు పొందిందని ఏకంగా సంఘ్ పరివార్ భజన చేశారు. హిందూత్వవాది అయిన శ్యాం ప్రసాద్ ముఖర్జీని శ్లాఘించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ముఖర్జీ తన జీవితాన్నే త్యాగం చేశారని మోడీ చెప్పుకొచ్చారు. ఎర్రకోట వేదికగా ఆర్‌ఎస్‌ఎస్‌పై మోడీ పొగడ్తలు కురిపంచడాన్ని ప్రతిపక్షాల నేతలు తీవ్రంగా ఆక్షేపించారు. స్వతంత్ర పోరాట సంగ్రామ సమయంలో ఆంగ్లేయులకు లొంగిపోయిన నేతల సంఘంగా, మహాత్మగాంధీని హత్య చేసి నిషేధానికి గురైన మతోన్మాద సంస్థగా పేరున్న సంస్థపై ఎర్రకోట వేదికగా, అందునా స్వతంత్ర దినోత్సవం వేళ ప్రధాని ప్రశంసలు కురిపించడం స్వతంత్ర సమరయోధులను అవమానించడమేనని విమర్శించారు.

ఆర్‌ఎస్‌ఎస్‌పై ప్రశంసలు సిగ్గుచేటు

- మన అమరుల జ్ఞాపకాలను అగౌరవపరచడమే
- ప్రధాని మోడీ ప్రసంగంపై సిపిఎం విమర్శ

5

ఆపరేషన్ సిందూర్‌పై ప్రత్యేక ప్రస్తావన

కాగా మోడీ తన ప్రసంగంలో ఆపరేషన్ సిందూర్ విజయాన్ని ప్రత్యేకంగా వివరించారు. తద్వారా పాకిస్తాన్‌తో సైనిక ఘర్షణ సమయంలో సాయుధ దళాలకు స్వేచ్ఛ కల్పించారా లేదా అనే విషయంపై నెలకొన్న వివాదాన్ని చల్లార్చేందుకు యత్నించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో తన ప్రభుత్వం సాయుధ దళాలకు పూర్తి స్వేచ్ఛను కల్పించడమే కాకుండా ఆపరేషన్ సందర్భంగా సైనిక లక్ష్యాలను నిర్ణయించుకునేందుకు వారికి అధికారం ఇచ్చామని తెలిపారు. పాక్ అణు బ్లాక్ మెయిలింగ్‌ను భారత్ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని ప్రధాని చెప్పారు. పాకిస్తాన్‌కు సింధు నదీ జలాల విడుదలను నిలిపి వేయాలన్న నిర్ణయాన్ని ప్రస్తావిస్తూ నీరు, రక్తం కలిసి ప్రవహించలేవన్న విషయాన్ని పొరుగు దేశానికి గట్టిగా గుర్తు చేశామని చెప్పారు. శత్రువులు చేసే ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు 'మిషన్ సుదర్శన్ చక్ర' పేరిట శక్తివంతమైన ఆయుధ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటున్నామన్నారు. '2035 నాటికి దేశంలోని మిగతా 5లో



విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న సిఎం చంద్రబాబు

నాలెడ్జ్ ఎకానమీదే భవిష్యత్

- నెలాఖరులోగా డిఎస్‌సి నియామకాలు పూర్తి
- బిసిల రక్షణ చట్టం కోసం మంత్రివర్గ ఉపసంఘం
- 2029 నాటికి అందరికీ ఇళ్లు
- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సిఎం చంద్రబాబు


ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సంపద సృష్టి జరగాలంటే నాలెడ్జ్ ఎకానమీ ప్రధానమని, అందుకే విద్య, నైపుణ్యాలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం జరిగిన వేడుకల్లో ఆయన జెండాను ఆవిష్కరించారు. తొలుత త్రివిధ దళాల నుండి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ శాఖలు ప్రదర్శించిన శకటాలను తిలకించారు. అనంతరం రాష్ట్ర ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల హామీలుగా ఉన్న సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. 'పేదల సేవలో' కార్యక్రమంలో 64 లక్షల మందికి ఏడాదికి రూ.33 వేల కోట్లు పింఛను రూపంలో చెల్లిస్తున్నట్లు చెప్పారు. 'తల్లికి వందనం'లో భాగంగా 67 లక్షల మంది మిగతా 5లో

తాగునీరూ కరువే!

- శ్మశాన వాటిక లేక కొండపక్కన అంత్యక్రియలు
- వైద్యం కోసం ఏడు కిలోమీటర్లు వెళ్లాల్సిందే...
- ఇదీ పోలవరం పునరావాస కాలనీ దుస్థితి
- నేడు, రేపు 'పోలవరం'లో ఎంఎ బేబీ, బ్రిట్టాస్ పర్యటన

3



తొలిసారిగా చైనాలో హ్యూమనాయిడ్ రోబో వరల్డ్ గేమ్స్

- 16 దేశాల నుంచి 280 జట్లు

బీజింగ్: సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన రోబో సినిమాలో చిట్టీ చేసిన విన్యాసాలు చూసి మనమంతా ఆశ్చర్యానికి, ఆనందానికి గురై ఉంటాం. లేదా అది సినిమా కాదా అని సరిపెట్టుకుని ఉండిఉంటాం. అయితే అంతకు మంచి అద్భుతం చైనాలో చోటు చేసుకుంది. చైనాలోని బీజింగ్‌లో తొలిసారిగా హ్యూమనాయిడ్ రోబో వరల్డ్ గేమ్స్ ప్రారంభమయ్యాయి. ఇక్కడ రోబోలు బాక్సింగ్, ఫుట్ బాల్, టేబుల్ టెన్నిస్, రన్నింగ్ రేసు, మిగతా 5లో






తొలి మూడు బహుమతులు గెలుచుకున్న పట్టు పరిశ్రమలశాఖ, మహిళాభివృద్ధి-శిశు సంక్షేమశాఖ, మెప్మా శకటాలు

'పట్టు' శకటానికి ప్రథమ బహుమతి

రెండు, మూడు స్థానాల్లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, మెప్మా శకటాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో వివిధ శాఖలు రూపొందించిన శకటాలను ప్రదర్శించారు. 'నా పట్టు - నా అభిమానం' నినాదంతో పట్టు పరిశ్రమలశాఖ రూపొందించిన శకటానికి ఈ ప్రదర్శనలో మొదటి బహుమతి లభించింది. 'తెలుగు వీర మహిళా జయహో' నినాదంతో మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ శకటం రెండో బహుమతి సాధించింది. 'ఒక కుటుంబం - ఒక పారిశ్రామిక వేత్త' నినాదంతో పలు కార్యక్రమాలను అమలు చేస్తున్న మెప్మా శకటం మూడో బహుమతిని సొంతం చేసుకుంది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలు 21 శకటాలను ప్రదర్శించాయి. ఆయా శాఖల అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బహుమతులు అందజేశారు. కార్యక్రమం పూర్తయిన అనంతరం శకటాలు ప్రదర్శన స్టేడియం నుంచి బందరు రోడ్డు, బెంజి సర్కిల్, రింగ్ రోడ్డు మీదుగా రామవరప్పాడు రింగ్, ఏలూరు రోడ్డు, కంట్రోల్ రూమ్ తదితర ప్రాంతాల మీదుగా కొనసాగింది.

పోలీసు అధికారులకు అవార్డులు

విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పలువురు పోలీసు అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అవార్డులను అందజేశారు. ప్రెసిడెంట్ పోలీసు మెడల్స్ అందుకున్న వారిలో అదనపు డిజిపి మహేష్ చంద్ర లడ్డా, ఐజి ఎం రవిప్రకాష్, డిఎస్‌పి డిడి గంగరాజు ఉన్నారు. పోలీసు మెడల్ అందుకున్న వారిలో రిటైర్డు కమాండెంట్ వెంకట్ ప్రేమ్ జిత్, 11వ బెటాలియన్ ఆర్‌ఎస్‌ఐ చెన్నయ్య ఆవుల, రిటైర్డు ఎఎస్‌ఐ ఆర్ రమణారెడ్డి, రిటైర్డు పోలీసు ఇన్‌స్పెక్టర్ అద్దంకి వెంకటేశ్వర్లు, ఎఎస్‌ఐ బి ప్రకాష్ రావు, ఎస్‌ఐ కరి మస్తాన్‌రావు, అసిస్టెంట్ కమాండెంట్ పివిఎస్‌ఎ దుర్గాప్రసాద్ రావ్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అక్కిశెట్టి శ్రీహరిరావు, డిఎస్‌పి ఈద కోటి రెడ్డి ఉన్నారు. అసాధారణ్ ఆశూచన కుశలతా పథక్ -2023 అందుకున్న వారిలో సిఆర్‌పిఎఫ్ ఐజి వినీత్ బ్రిజ్‌లాల్, డిఎస్‌పి ఉజ్జి శ్రీనివాసరావు, ఈగల్ ఆర్‌ఐ ధనుంజయ నాయుడు, ఎఆర్ ఎస్‌ఐ దాసరి గిరిధర్ ఉన్నారు. ఉగాధి పర్వదినాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి శౌర్య పథకం అందుకున్నవారిలో ఎస్ గోవిందరావు, వై రమేష్, టి రాజేష్, కె మహేష్, ఎన్ చంద్రశేఖర్, ఎం మోహన్ కుమార్, ఎ వెంకటేష్, ఎన్ తులసీరాజ్, షేక్ ఖాజా ఉన్నారు.



అవార్డులు పొందిన పోలీసు అధికారులతో సిఎం చంద్రబాబు నాయుడు తదితరులు

జాతీయజెండా తీస్తుండగా..

విద్యుత్ తీగలు తగిలి ఒకరు మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం పెదవెల్లమిల్లిలో జెండా ఆవిష్కరణకు వినియోగించిన రాడ్‌ను తీస్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో ఒకరు మృతి చెందిన ఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...పెదవెల్లమిల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం ఉదయం జాతీయ జెండాను ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీరాణి ఆధ్వర్యంలో ఎస్‌ఎంసి చైర్మన్ ఎగురవేశారు. అనంతర సాయంత్రం ఐదు గంటలకు జెండాను అవనతం చేసి ఇనుప రాడ్‌ను పక్కన పెట్టేందుకు ఆ పాఠశాలలోని స్వీపర్ భర్త ఉసురుమర్తి భీమరాజు (42) వెళ్లారు. ఈ క్రమంలో ఇనుప రాడ్‌కు పక్కనే ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో భీమరాజు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి పోలీసులు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. భీమరాజుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఖజానా జ్యువెలరీ దోపిడీ కేసులో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ చందానగర్‌లోని ఖజానా జ్యువెలరీలో దోపిడీ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. బీదర్‌లో ఇద్దరిని, పుణెలో మరొకరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను బీహార్ వాసులుగా గుర్తించారు. ఈనెల 12న చందానగర్‌లోని ఖజానా జ్యువెలరీలో దోపిడీ జరిగిన సంగతి తెలిసిందే. నగల దుకాణం ఉద్యోగిపై కాల్పులు జరిపిన ముఠా దోపిడీకి పాల్పడింది. నెల రోజుల క్రితం ఈ బీహార్ ముఠా హైదరాబాద్‌కు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. జగద్గిరిగుట్టలో ఉంటూ ఓ గ్లాసు పరిశ్రమలో పనిలో చేరారు. బీహార్ నుంచి వచ్చేటప్పుడు తుపాకులు తెచ్చుకొని, కొన్ని రోజుల పాటు రెక్కీ నిర్వహించారు. దోపిడీ చేసిన హైదరాబాద్ నుంచి పరారయ్యారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్ ఏర్పాటు చేసిన ఎట్ హోం కార్యక్రమంలో సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్ తదితరులు

రాజ్‌భవన్‌లో తేనేటి విందు

- హాజరైన సిఎం, డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఏర్పాటుచేసిన తేనేటి విందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హైకోర్టు ప్రధాన నాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తదితరులు హాజరయ్యారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో శుక్రవారం సాయంత్రం ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా చంద్రబాబు నాయుడు సతీసమేతంగా రాజ్‌భవన్‌కు చేరుకోగా, కాసేపటి తరువాత పవన్‌కల్యాణ్ కూడా సతీసమేతంగా చేరుకున్నారు. అనంతరం గవర్నరుకు సిఎం, డిప్యూటీ సిఎం, హైకోర్టు సిజెతో పాటు మంత్రి నారా లోకేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, డిజిపి హరీష్‌కుమార్ గుప్తా, గవర్నర్ కార్యదర్శి హరి జవహర్ లాల్ స్వాగతం పలికారు. మంత్రులు లోకేష్, కొల్లు రవీంద్ర మినహా ఎవరూ ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు. ఎంపిలలో కూడా విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) మాత్రమే హాజరయ్యారు. వైసిపి, కాంగ్రెస్ కూడా ఎట్‌హోం కార్యక్రమానికి దూరంగా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ మయాన జకియా ఖానం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జనసేన ఎమ్మెల్సీ పి హరిప్రసాద్, టిడిపి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, సాధారణ పరిపాలనశాఖ ముఖ్యకార్యదర్శి ముకేష్‌కుమార్ మీనా, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి జయలక్ష్మి, సమాచారశాఖ చీఫ్ కమిషనర్ ఆర్‌ఎం బాషా, కమిషనర్లు, శామ్యూల్, రెహానా, ఎపిపిఎస్‌సి ఛైర్మన్ అనూరాధ తదితరులు హాజరయ్యారు.

సిఇఎకు రూ.28,033 కోట్ల ప్రాజెక్టుల ప్రతిపాదన

- ట్రాన్స్‌కో జెఎమ్‌డి కీర్తి చేకూరి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్-3లో భాగంగా దాదాపు రూ.28,033 కోట్ల విలువైన ప్రాజెక్టుల తుది ప్రతిపాదనలు సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సిఇఎ)కు సమర్పించినట్లు ట్రాన్స్‌కో జెఎమ్‌డి కీర్తి చేకూరి తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 11 గిగావాట్ల సౌరశక్తి, 7,373 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను గ్రిడ్ అనుసంధానం చేస్తామని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడలోని విద్యుత్ సౌధలో ఆమె జాతీయ పతాకాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నూతనంగా చేపట్టే ప్రాజెక్టులు పూర్తయితే 8,862 సర్క్యూట్ కిలోమీటర్ల కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్లు, 9,500 ఎంవిఎ విద్యుత్ సామర్థ్యం చేకూరుతుందని తెలిపారు. రూ.8,638 కోట్ల వ్యయంతో 69 ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులను ట్రాన్స్‌కో అమలు చేస్తోందని చెప్పారు. టెలికాం సంస్థలకు ఆప్టికల్ గ్రౌండ్‌వైర్ డార్క్ ఫైబర్లను లీజుకివ్వడం ద్వారా నాన్ టారిఫ్ ఆదాయం రూ.174.47 కోట్లకు పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ వి ఉష, డైరెక్టర్లు, ఎకెవి భాస్కర్, జె వెంకటేశ్వరరావు, ఎన్‌వి రమణమూర్తి, జెన్‌కో డైరెక్టర్లు ఎం సుజయ్‌కుమార్, పి అశోక్‌కుమార్ రెడ్డి, అడిషనల్ సెక్రటరీ పెద్ది రోజా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను వదలని సీటు వివాదం!

- నిన్న కార్పొరేషన్ జనరల్ బాడీ, నేడు స్వాతంత్ర్య దినోత్సవం
- వేదికపై సీటు వేయలేదని అధికారులపై ఆగ్రహం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప ఎమ్మెల్యే ఆర్ మాధవిని సీటు వివాదం వదలడం లేదు. గత మూడు కార్పొరేషన్ సర్వసభ్య సమావేశాల వేదికపై సీటు వేయలేదనే పేరుతో సమావేశాలు జరగకుండా అడ్డుకున్నారు. తాజాగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేదికపై సీటు వేయలేదనే పేరుతో జిల్లా అధికారిపై నిరసన తెలిపి, ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు శుక్రవారం స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా ఏర్పాట్లు చేశారు. గతేడాది తరహాలో స్వాతంత్ర్య దిన్సోవ వేదికపై న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండి ఫరూఖ్, కలెక్టర్ సి శ్రీధర్, ఎస్‌పి ఇ.జి.అశోక్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్ ఆసీనులయ్యారు. ప్రభుత్వ ఆశయాలను, జిల్లా ప్రగతి తీరుతెన్నులపై సుదీర్ఘంగా మంత్రి ఎన్‌ఎండి ఫరూక్ ప్రసంగించారు. కడప ఎమ్మెల్యే ఆర్ మాధవి, ఆమె భర్త టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్ శ్రీనివాసులరెడ్డి సతీసమేతంగా ఆలస్యంగా స్వాతంత్ర్య దినోత్సవాలకు హాజరయ్యారు. ఆనక వేదికపై సీటు లేకపోవడం పట్ల జిల్లా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధికార యంత్రాంగం తేరుకుని ఎమ్మెల్యేకు సీటును ఏర్పాటు చేసి జెసి అతిథిసింగ్, జిల్లా కలెక్టర్ వేర్వేరుగా వచ్చి ఎమ్మెల్యేను ఆహ్వానించారు. అయినప్పటికీ నిరసనగా కొద్దిసేపు నిలుచునే స్వాతంత్ర్య దిన్సోవాలను వీక్షించిన అనంతరం వెళ్లిపోయారు. ఇదంతా మంత్రి గమనించినప్పటికీ ప్రేక్షక పాత్ర వహించారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించాలి

- ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత మూడు రోజులుగా పడుతున్న భారీ వర్షాలు కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టాన్ని వెంటనే అంచనా వేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు నష్టపరిహారం ఇవ్వాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం, ఇతర వాతావరణ పరిస్థితుల్లో వచ్చిన మార్పుల వల్ల పడుతున్న నిరవధిక వర్షాలతో నంద్యాల, బాపట్ల, గుంటూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, ఏలూరు, అంబేద్కర్ కోనసీమ తదితర జిల్లాల్లో వేలాది ఎకరాల్లో రైతులు సాగుచేసిన వరి, మొక్కజొన్న, పత్తి, పెసర, కంది, వేరుశనగ తదితర పంటలు పూర్తిగా నీట మునిగిపోయాయని తెలిపారు. వాగులు, వంకలు పొంగి పొర్లడంతో రైతులు వేసిన పంటలన్నీ ఎక్కువ భాగం కోలుకునే అవకాశం లేదన్నారు. కొన్ని ప్రాంతాల్లో పెసర పంట చేతికొచ్చే దశలో వర్షాలు వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో వ్యవసాయశాఖ అధికారులు తక్షణమే నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలివ్వాలని కోరారు.

విత్తనాలతోపాటు రూ.10 వేలు నష్ట పరిహారం

ఎపి కౌలు రైతు సంఘం డిమాండ్

విత్తనాలతో పాటు ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారం కౌలు రైతులకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపి కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు ఒక ప్రకటన విడుదల చేశారు. వరదలతో పంటతో పాటు ఆయిల్ ఇంజిన్లు, మోటార్లు మునిగిపోయాయని, వాటిని కూడా ఎన్యూమరేషన్ చేసి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు గుర్తింపు కార్డులు లేకపోయినా వరదలు, వర్షాలతో నష్టపోయిన వాస్తవ సాగుదారులైన కౌలు రైతుల పేర్లను నమోదు చేయాలన్నారు. తమ సంఘం నేతలు తెనాలి, బాపట్ల, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో పర్యటించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వేలాది ఎకరాల పంట నీటి మునిగిందన్నారు. కొన్ని ప్రాంతాల్లో వాణిజ్య పంటలతో పాటు పెసర, కూరగాయల పంటలు నీట మునిగిపోయాయన్నారు.

పార్టీ కార్యాలయాల్లో స్వాతంత్ర్య వేడుకలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి కార్యాలయంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శుక్రవారం జరిగాయి. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎందరో సమరయోధుల ప్రాణత్యాగాల ఫలితంగా స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పారు. నాయకులకు డబ్బు పట్ల కాకుండా సమాజం పట్ల బాధ్యత ఉండాలని, త్యాగమూర్తుల ఆశయాలకు అనుగుణంగా నడిచే నాయకత్వం అవసరమని చెప్పారు. టిడిపి కార్యాలయ కార్యదర్శి పి అశోక్‌బాబు మాట్లాడుతూ.. నేటి తరానికి స్వాతంత్ర్య ఉద్యమం గురించి పాఠ్యపుస్తకాల ద్వారానే తెలుస్తుందన్నారు. స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యంపై యువతకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నాదెండ్ల బ్రహ్మం, ఎవి రమణ, పర్చూరి కృష్ణ, జి.రఘురామ కృష్ణంరాజు, పాతర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నాయకుల ఆశయాలకు కృషి : ఎమ్మెల్సీ హరిప్రసాద్

జాతీయ నాయకుల ఆశయాల సాధనకు కృషి చేయాలని జనసేన ఎమ్మెల్సీ పి హరిప్రసాద్ తెలిపారు. మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన నాయకుల ఆశయాలు, ఆలోచనలే ఆలంభనగా పవన్ కల్యాణ్ జనసేనను స్థాపించారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కళ్యాణం శివశ్రీనివాస్, గంజి చిరంజీవి, చందు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్‌తో బిజెపి కుమ్మక్కు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఎన్నికల కమిషన్‌తో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుమ్మక్కై ఓటు హక్కును కాలరాసే పద్ధతిలో వ్యవహరిస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. విజయవాడలోని దాసరి భవన్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బిజెపికి పూర్తి మద్దతు వస్తే ప్రస్తుతం ఉన్న లౌకిక రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి ఆధారంగా మతోన్మాదంతో కూడిన రాజ్యాంగం అమలు చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మరో స్వాతంత్ర్య పోరాటం తప్పదు : షర్మిల

ప్రధాని మోడీ చెర నుంచి దేశాన్ని కాపాడేందుకు మరో స్వాతంత్ర్య పోరాటం చేయాల్సి ఉందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల తెలిపారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎంతో మంది నాయకుల త్యాగాల ఫలితంగా స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో జగన్, చంద్రబాబు ఒకే విధానాలను అనుసరిస్తున్నారని పేర్కొన్నారు. కుప్పంలో నాడు జగన్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తే, నేడు పులివెందులలో చంద్రబాబు అదే చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి జెడి శీలం, మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలీ, పార్టీ నాయకులు నరహరిశెట్టి నరసింహారావు తదితరులు ఉన్నారు.

జాతీయ భావాన్ని పెంపొందించాలి : బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్

ప్రతి ఒక్కరిలో జాతీయ భావాన్ని పెంపొందించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ తెలిపారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు.



ప్రకాశం బ్యారేజీకి తగ్గిన వరద

- ప్రమాద హెచ్చరికలు ఉపసంహరణ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ, శ్రీశైలం ప్రాజెక్ట్

ప్రకాశం బ్యారేజీకి వరద ఉధృతి క్రమేపీ తగ్గుముఖం పట్టింది. దీంతో మొదటి, రెండవ ప్రమాద హెచ్చరికలను ఉపసంహరించారు. గురువారం మధ్యాహ్నం ప్రకాశం బ్యారేజీకి గరిష్టంగా 5,65,807 క్యూసెక్కులు వచ్చిన వరద శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు ఇన్‌ఫ్లో 3,04,209 క్యూసెక్కులకు తగ్గింది. వరద తగ్గుముఖం పట్టడంతో 70 గేట్లల్లో 35 గేట్లను ఎనిమిది అడుగుల మేర, మరో 35 గేట్లను ఏడు అడుగుల మేర ఎత్తి మూడు లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 3,209 క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతోంది.

శ్రీశైలం మూడు గేట్ల ద్వారా నీటి విడుదల

జూరాల గేట్లను తెరవడంతో శ్రీశైలానికి వరద ప్రవాహం కొనసాగుతుంది. దీంతో జలాశయం మూడు గేట్లను ఎత్తి దిగువకు వరద నీటిని విడుదల చేస్తున్నారు. శుక్రవారం మూడు గంటల సమయానికి ఎగువ జూరాల నుండి 1,13,920 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 28,448 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 250 క్యూసెక్కులతో కలిపి శ్రీశైలం జలాశయానికి 1,78,059 క్యూసెక్కులు వచ్చి చేరుతున్నాయి. జలాశయం మూడు గేట్లను పది అడుగుల మేర ఎత్తి దిగువ నాగార్జునసాగర్‌కు 66,242 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. జలాశయ నీటిమట్టం 885 అడుగులకుగాను ప్రస్తుతం 882 అడుగులుగా ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 215 టిఎంసిలకుగాను ప్రస్తుతం 198.8120 టిఎంసిలుగా నమోదైంది.



పుస్తక మహోత్సవ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి స్వామి, ఎంపి మాగుంట తదితరులు

ఒంగోలులో బుక్ ఫెస్టివల్ ప్రారంభం

- చరిత్ర తెలుసుకోవాలంటే పుస్తకాల అధ్యయనమే మార్గం : మంత్రి స్వామి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఒంగోలు పివిఆర్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో మూడవ పుస్తక మహోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. పది రోజుల పాటు ఈ ఎగ్జిబిషన్ కొనసాగనుంది. పుస్తక మహోత్సవాన్ని ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డితో కలిసి మంత్రి బాల వీరాంజనేయస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి స్వామి మాట్లాడుతూ... చిన్న పిల్లలకు బాల సాహిత్యం, పెద్దలకు చరిత్ర - సంస్కృతికి చెందిన గ్రంథాలు, యువతకు కృత్రిమ మేధను అధ్యయనం చేసే అరుదైన వేల పుస్తకాలు ఒంగోలు నగర ప్రజలకు అందుబాటులోకి తేవడం అభిలషణీయమన్నారు. భారతీయ సంస్కృతితో పాటు జాతీయోద్యమంలో కృషి చేసిన ప్రముఖుల చరిత్రలు, అధ్యయన గ్రంథాలు, విజ్ఞానదాయకమైన పుస్తకాలు అందుబాటులో ఉంచడం ప్రజాశక్తి, విశాలాంధ్ర వంటి సంస్థలకే దక్కుతుందని కొనియాడారు. చరిత్రను తెలుసుకోవాలంటే పుస్తకాల అధ్యయనం తప్ప మరో మార్గం లేదని చెప్పారు. తాను గతంలో ప్రజాశక్తి, విశాలాంధ్ర పబ్లిషర్స్‌కు చెందిన మొబైల్ పుస్తకాల ఎగ్జిబిషన్‌ను సందర్శించినట్లు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ పుస్తక ప్రదర్శన విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ జనరల్ మేనేజర్ కె.లక్ష్మయ్య, విశాలాంధ్ర బుక్‌హౌస్ జనరల్ మేనేజర్ మనోహర్ నాయుడు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, నగర కమిషనర్ డాక్టర్ కె వెంకటేశ్వరరావు, ప్రజానాట్యమండలి నాయకులు నల్లూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



బస్సు డ్రైవింగ్ సీట్లో కూర్చొని మహిళకు జీరో టికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

'స్త్రీశక్తి' అమలు సమయంపై స్పష్టత కరువు

- పథకం తొలిరోజు మహిళల ఇబ్బందులు

ప్రజాశక్తి- యంత్రాంగం

స్త్రీశక్తి పథకం ప్రారంభం రోజు మహిళలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ పథకం ఆగస్టు 15 నుంచి ప్రారంభం అవుతుందని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం నిర్దేశించిన ఆర్‌టిసి బస్సులను శుక్రవారం ఉదయం ఎక్కిన మహిళలకు చేదు అనుభవం ఎదురైంది. ఇంకా ఈ పథకం ప్రారంభం కాలేదని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పథకాన్ని సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభిస్తారని, అప్పటి నుంచి మాత్రమే జీరో టికెట్ వస్తుందని, ఈలోగా ప్రయాణించే మహిళలు, బాలికలు టికెట్టు తీసుకోవాల్సిందేనని కండక్టర్లు తేల్చి చెప్పారు. దీంతో, కొందరు మహిళలు వారితో వాగ్వావాదానికి దిగారు. ఉచిత ప్రయాణం అనుకొని డబ్బులు తెచ్చుకోకపోతే తమ పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. అమలయ్యే సమయంపై ప్రభుత్వం ముందుగానే స్పష్టత ఇచ్చి ఉండాల్సిందని పలువురు మహిళలు వ్యాఖ్యానించారు. వారికి సర్దిచెప్పేందుకు కండక్టర్లు ఇబ్బంది పడాల్సి వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

అట్టహాసంగా పథకం ప్రారంభం

రాష్ట్రంలో అట్టహాసంగా స్త్రీశక్తి పథకం ప్రారంభమైంది. ఆయా బస్ స్టాండ్లలో మంత్రులు, అధికార పార్టీ ఎంపిలు, ఎమ్మెల్యేలు ఈ పథకాన్ని ప్రారంభించి మహిళలతో కలిసి బస్సుల్లో ప్రయాణించారు. తొలిరోజు బస్సుల్లో మహిళల రద్దీ కానరాలేదు.

స్వయంగా బస్ నడిపి, మహిళలకు జీరో టికెట్ ఇచ్చిన ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ స్వయంగా బస్సును కొంతదూరం నడిపి ఈ పథకాన్ని ప్రారంభించారు. మహిళలకు జీరో టికెట్ జారీ చేశారు.

చిక్కడపల్లిలో భారీ చోరీ

- 36 తులాల బంగారం, రూ.35 వేలు అపహరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ చిక్కడపల్లిలోని ఒక అపార్ట్‌మెంట్‌లో భారీ చోరీ జరిగింది. మరమ్మతులు జరుగుతున్న ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో దొంగ ఇంట్లోకి చొరబడ్డాడు. బీరువాలో ఉన్న 36 తులాల బంగారం, రూ.35 వేలు దోచుకెళ్లాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. వివేక్‌నగర్ త్యాగరాయగాన సభ సమీపంలోని దిట్టకవి ఎంక్లేవ్ అపార్ట్‌మెంట్ రెండో అంతస్తులో డి.నారాయణ అనే మిథాని కంపెనీ విశ్రాంత ఉద్యోగి నివాసం ఉంటున్నాడు. సదరు ఫ్లాట్ ప్రధాన ద్వారం తలుపులకు చెదలు పట్టడంతో కొత్త తలుపులు బిగించడానికి పనులు జరుగుతున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఏదో శబ్దం వినిపించి నారాయణ బయటకు వచ్చి చూశారు. అయితే మరమ్మతులో ఉన్న తలుపులకు గొళ్లెం వేయడం మరిచిపోయి నిద్రకు ఉపక్రమించారు. అదే సమయంలో అపార్ట్‌మెంట్ వెనుక వైపు నుంచి ఒక అగంతకుడు ఇంటి లోపలికి చొరబడి... బీరువా తాళాలు దానికే ఉండటంతో 36 తులాల బంగారం, రూ.35 వేలు దోచుకెళ్లాడు. ఉదయం కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిసి కెమెరాల ఆధారంగా దొంగను గుర్తించి మధ్యాహ్నానికి పట్టుకుని బంగారం, నగదును పోలీసులు రికవరీ చేసినట్టు సమాచారం.

రాజకీయ పార్టీల్లో తగ్గుతోన్న జవాబుదారీతనం

- వైసిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజకీయ పార్టీల్లో జవాబుదారీతనం తగ్గుతోందని వైసిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. వ్యవస్థలన్నీ ఆరోగ్యకరంగా ఉండాలని వైసిపి అధినేత జగన్ చెబుతున్నారని, రాష్ట్రంలో తాత్కాలిక అవసరాల కోసం వ్యవస్థలను వాడుకుంటూ అధికారం కోసం ఎలాంటి హామీలైనా ఇవ్వొచ్చనే బాధ్యతారాహిత్యం కనిపిస్తోందని అన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో పోలైన ఓట్లకు, ఫలితాలు వచ్చిన ఓట్లకు 12.5 శాతం తేడా అంటే సుమారు 50 లక్షల ఓట్లు తేడాలొచ్చాయని వివరించారు. ఎన్నికల అరాచకాలపై కోర్టు మెట్లెక్కితే ఆధారాలు అడుగుతారనుకున్నామని, అదీ జరగలేదని వివరించారు. ఇటీవల ఎన్నికలు జరిగిన గ్రామాల్లో ఎంతమంది వేలికి సిరాచుక్క ఉందో పరిశీలించాలని కోరారు.

సూపర్ సిక్స్ ఫ్లాప్ : అంబటి రాంబాబు

ఎన్నికల్లో సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదని, అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాలనూ మోసం చేశారని మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. పులివెందుల, ఒంటిమిట్ట గ్రామాల్లో ఓటర్ల వేలిపై సిరా చుక్కలేదని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఆరోపించారు. లోకేష్ ట్వీట్‌లో పెట్టిన ఫొటోల్లోనే దొంగ ఓటర్లు కనిపిస్తున్నారని పేర్కొన్నారు. 52 వేల ఎకరాలు అభివృద్ధి చేయకుండానే మరో 43 వేల ఎకరాలు సేకరించాలని చూస్తున్నారని వివరించారు. ఇప్పటికే అడ్వాన్సులు ఇచ్చి అందులో ఎనిమిది శాతం కమీషన్‌గా తీసుకుంటున్నారని అన్నారు. చంద్రబాబు సోదరీమణులు ఒక్కసారైనా ఆయనకు రాఖీ కట్టలేదని, అటువంటి వ్యక్తి జగన్ సోదరి గురించి మాట్లాడుతున్నారని చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

తాను ఇచ్చిన అప్పులు వసూలు కాకపోవడంతో మనస్తాపానికి గురై పొలంలోని బావిలో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం కన్నాపురంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. మృతుని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాపురం గ్రామానికి చెందిన మోటారు మెకానిక్ మజ్జి నరసింహారావు (40)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కన్నాపురం గ్రామ ప్రజల వాట్సాప్ గ్రూపులో అప్పులు వసూలు కాకపోవడం, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ మెసేజ్ పెట్టి బలవన్మరణానికి పాల్పడ్డాడు.

'ఉచిత బస్సు'తో మహిళలకు ఆర్థిక భరోసా

- డోర్ పికప్ సర్వీసుల ద్వారా ఆదాయ ఆర్జన
- 'స్త్రీ శక్తి'ని ప్రారంభించిన సిఎం చంద్రబాబునాయుడు


బస్సులో ప్రయాణిస్తున్న మహిళకు జీరో టికెట్ అందజేస్తున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉచిత బస్సు ప్రయాణ పథకం (స్త్రీ శక్తి) అమలుతో మహిళలకు ఆర్థిక భరోసా లభిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఉండవల్లి బస్టాండు వద్ద ఈ పథకాన్ని చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ప్రారంభించారు. అనంతరం ఐటి శాఖ మంత్రి నారా లోకేష్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్‌తో కలిసి విజయవాడ బస్టాండుకు బస్సులో ప్రయాణం చేశారు. బస్సులో ఉన్న మహిళలతో ఉచిత బస్సు పథకం గురించి మాట్లాడారు. అనంతరం విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సభలో సిఎం మాట్లాడుతూ ఈ పథకం అమలు ద్వారా 2.62 కోట్ల మందికి లబ్ధి చేకూరుతుందని, ఇందుకోసం ఏడాదికి రూ.1942 కోట్లు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. ఈ పథకం అమలు ద్వారా విద్యార్థినులు విద్యాసంస్థలకు, ఉద్యోగినులు తమ కార్యాలయాలకు ఉచితంగా వెళ్లవచ్చన్నారు. అదేవిధంగా పెద్దవాళ్లు పుణ్యక్షేత్రాలకు, చిరువ్యాపారులైన మహిళలు వారి ఉత్పత్తులను ఒక చోట నుంచి మరొకచోటకు ఉచితంగా తీసుకువెళ్లి అమ్ముకోవచ్చన్నారు. ఉపాధి హామీ పనులకు వెళ్లే మహిళా కార్మికులు ఉచిత బస్సులో ప్రయాణం చేయడం ద్వారా డబ్బు ఆదా చేసుకోవచ్చన్నారు. ఇ-పోస్ మిషన్ ద్వారా మహిళలకు జీరో ఫేర్ టిక్కెట్ వస్తుందని, బస్సులో ఎలాంటి ఛార్జీ వసూలు చేయబోరని తెలిపారు. బస్‌లో ఉచిత ప్రయాణానికి ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా ఆర్‌టిసి అధికారులు చర్యలు తీసుకోవాలని, ఈ పథకాన్ని సక్రమంగా అమలు చేయకపోతే తానే రోడ్ల మీదకు వస్తానని చెప్పారు. ఈ పథకాన్ని విఫలం చేయాలని కొందరు ప్రయత్నిస్తున్నారని, అలాంటి వారిని డ్రైవర్లు, కండక్టర్లు గమనిస్తూ ఉండాలన్నారు. బస్సుల్లో ఉచిత ప్రయాణానికి ఖర్చవుతున్న నేపథ్యంలో ఆర్‌టిసి ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు వీలుగా పార్శిల్ సర్వీసుల సేవలు పెంచనున్నట్లు చెప్పారు. డోర్ డెలివరీ, డోర్ పికప్ సర్వీసులు పెంచడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. మహిళల భద్రత దృష్ట్యా ప్రతి బస్సులో జిపిఎస్ అమర్చుతామని, బస్సు ఏ రూట్‌లో వెళుతుందనేది రియల్ టైమ్ ద్వారా ట్రాక్ చేస్తామన్నారు. ఉచిత బస్ ప్రయాణం ద్వారా ఆటో డ్రైవర్లకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుని, వారికి న్యాయం చేస్తామన్నారు. ఇందుకోసం ఇప్పటికే క్యాబినెట్ సబ్ కమిటీ వేశామన్నారు. నివేదిక రాగానే ఆటో డ్రైవర్లకు నష్టం లేకుండా వారికి న్యాయం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈనెలాఖరకు డిఎస్‌సి పోస్టులు భర్తీ చేస్తామని చెప్పారు. డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం ఆర్థిక భద్రత, ప్రయాణ స్వేచ్ఛ, సామాజిక గౌరవానికి ప్రతీక అని అన్నారు. జీరో ఫేర్ టిక్కెట్ ద్వారా మహిళలకు ఐదు రకాల బస్సుల్లో రాష్ట్రంలో ఏ ప్రాంతం నుంచి ఏ ప్రాంతానికైనా ప్రయాణించవచ్చన్నారు. సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీలన్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ యువగళంలో మహిళల కష్టాలు చూశాకే సూపర్ సిక్స్‌ను ప్రవేశపెట్టాలని సిఎంను కోరినట్లు లోకేష్ వెల్లడించారు. టిడిపి ఆవిర్భావంతోనే మహిళలకు పెద్దపీట వేయడం ప్రారంభమైందన్నారు. మహిళలకు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. సినిమా, వెబ్ సిరీస్‌ల్లో మహిళలను అవమానపరిచే డైలాగ్స్ బ్యాన్ చేసే విధంగా చట్టం తీసుకురావాలని సిఎంకు లోకేష్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపి కేశినేని చిన్ని, విజయవాడ సెంట్రల్, ఈస్ట్ ఎమ్మెల్యేలు బోండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్‌రావు, ఆర్‌టిసి ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకాతిరుమలరావు, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా పాల్గొన్నారు.

వివేకాను హత్య చేసిన వారిని శిక్షించాలా ? లేదా?

పులివెందులలో తాజాగా జరిగిన జెడ్‌పిటిసి ఎన్నికల్లో ఒక ఓటరు తన ఓటుతో పాటు వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేసిన వారిని శిక్షించాలని, మా వివేకాసార్‌కు న్యాయం చేయండి రాసి బ్యాలెట్ బాక్సులో వేశారని, వివేకా హత్య చేసిన వారిని శిక్షించాలా? వద్దా.. ? అని ఈ సందర్భంగా మహిళలను చంద్రబాబు అడిగారు. తప్పనిసరిగా శిక్షించాలని ప్రజల నుంచి సమాధానం వచ్చింది. బ్యాలెట్ బాక్సులో మరో ఓటుతో పాటు పులివెందులలో 30 ఏళ్ల తర్వాత ఓటేశానని, అందరికీ దండాలు అంటూ స్లిప్ రాసి బాక్సులో వేశారన్నారు. కొందరు నేరస్తులు రాజకీయ ముసుగులో సమాజాన్ని అతలాకుతలం చేయాలనుకుంటున్నారని, వారి ఆటలు సాగనివ్వని, 'ఇక్కడున్నది 2025 సిబిఎన్ కాదని, 1995 నాటి సిబిఎన్' అని ఆయన అన్నారు.

మార్గదర్శకాలకు లోబడే స్పీడ్ బ్రేకర్లు

- హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసేటప్పుడు కేంద్ర రవాణా శాఖ, ఇండియన్ రోడ్ కాంగ్రెస్ జారీ చేసిన గైడ్‌లైన్స్ అమలుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. స్పీడ్ బ్రేకర్ల విషయంపై పిటిషనర్ ఇచ్చిన వినతి పరిగణనలోకి తీసుకొని తగిన చర్యలు తీసుకోవాలంది. రాష్ట్ర హైవేలు, జిల్లా ప్రధాన రోడ్లు, గ్రామీణ రోడ్లపై ఎక్కడపడితే అక్కడ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని హెచ్చరించింది. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను తొలగించి గైడ్‌లైన్స్‌కు అనుగుణంగా ఏర్పాటు చేసేందుకు సూపరింటెండెంట్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ చీఫ్ ఇంజినీర్ జారీ చేసిన మెమోను అమలుపర్చాలంది. స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు అంశంపై ఐఆర్‌సి కొత్త మార్గదర్శకాలు తీసుకొచ్చిందని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది చెబుతున్నారని తెలిపింది. గైడ్‌లైన్స్‌కు అనుగుణంగా స్పీడ్ బ్రేకర్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. గైడ్‌లైన్స్‌కు విరుద్ధంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను తొలగించి ఇండియన్ రోడ్ కాంగ్రెస్ మార్గదర్శకాలకు అనుగుణంగా వాటిని తిరిగి ఏర్పాటు చేసేలా ఉత్తర్వులివ్వాలంటూ అడ్వకేట్ తాండవ యోగేష్ వేసిన పిల్‌లో రోడ్లు, భవనాలశాఖ చీఫ్ ఇంజినీర్‌కు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేస్తూ తీర్పు వెలువరించింది.

తిరుమలలో యాత్రికుల రద్దీ

తిరుపతి బ్యూరో: వరుసగా మూడ్రోజులు సెలవులు రావడంతో శుక్రవారం తిరుమల యాత్రికులతో కిటకిటలాడింది. శ్రీవారి దర్శనానికి 24 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు పూర్తిగా యాత్రికులతో నిండిపోయాయి. వారం రోజులుగా వాతావరణం మేఘావృతమై, వర్షం పడుతుండడంతో యాత్రికులు చలితో అల్లాడుతున్నారు. క్యూలైన్‌లో వేచి ఉన్న వారికి అన్నప్రసాదం, నీళ్లు, పాలను శ్రీవారి సేవలు, టిటిడి సిబ్బంది అందిస్తున్నారు. తిరుమలలో నూతనంగా నిర్మించిన పద్మావతి సదనం భవనాన్ని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ ఎంటి కృష్ణబాబు, దాత మైత్రి శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.


గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న మంత్రి పవన్ కల్యాణ్

ప్రగతి పథంలో రాష్ట్రం

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

టిడిపి కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ అన్నారు. కాకినాడలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ఎందరో త్యాగాల వల్ల దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, దీన్ని సద్వినియోగం చేసుకుంటూ దేశాన్ని కాపాడుకోవాలని అన్నారు. శాంతి భద్రతలు సుస్థిరంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయని తెలిపారు. దీని కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషికి ప్రజలందరూ తోడ్పాటు అందించాలని కోరారు. ప్రతిపక్ష నాయకులు, ఓడిపోతే ఓటు చోరీ అంటున్నారని, గెలిచినప్పుడు ఒక న్యాయం, ఓడినప్పుడు ఒక న్యాయమా? అని వైసిపిని ఉద్దేశించి మాట్లాడారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. తాను ప్రాతినిథ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా మలిచే లక్ష్యంతో ఇప్పటి వరకూ రూ.308 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. అనంతరం పలువురికి పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమంలో పవన్‌కల్యాణ్ సతీమణి అన్నాలెజ్నేవా, కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎంఎల్‌సిలు, కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, ఎంఎల్ఎలు వనమాడి కొండబాబు, పంతం నానాజీ, నిమ్మకాయల చినరాజప్ప తదితరులు పాల్గొన్నారు.

సత్వర న్యాయం కోసం కృషి

- హైకోర్టు సిజె జస్టిస్ ఠాకూర్

ప్రజాశక్తి-అమరావతి

న్యాయం కోసం కోర్టులకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోందని, కక్షిదారులకు సత్వర న్యాయం అందించాల్సి వుందని హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ తెలిపారు. దేశ ప్రజాస్వామ్య మూల స్థంభాల్లో న్యాయ వ్యవస్థ కూడా కీలక భూమిక పోషిస్తోందన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు న్యాయ వ్యవస్థ దోహదపడుతోందన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుక సందర్భంగా శుక్రవారం ఆయన హైకోర్టు ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, దేశాభివృద్ధికి అందరూ పునరంకితం కావాలన్నారు. ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగా స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె చిదంబరం, బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఎన్ ద్వారకనాథరెడ్డి మాట్లాడారు. న్యాయవాదులపై దాడులు జరుగుతున్నాయని, న్యాయవాదుల రక్షణ చట్టం తేవాల్సిన అవసరం ఉందని అన్నారు. హైకోర్టు న్యాయమూర్తులు, వారి కుటుంబ సభ్యులు, రిటైర్డు న్యాయమూర్తులు జస్టిస్ శ్యామ్‌ప్రసాద్, జస్టిస్ ఎవి శేషసాయి, జస్టిస్ దుప్పల వెంకటరమణ, అదనపు ఎజి సాంబశివ ప్రతాప్, పిపి మెండ లక్ష్మీనారాయణ, న్యాయవాదులు, జిపిలు, కోర్టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సచివాలయం సమీపంలోని ఎపి న్యాయసేవాధికార సంస్థ కార్యాలయం వద్ద హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ జాతీయ జెండాను ఆవిష్కరించారు.


గుంటూరులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో గౌరవ వందనం స్వీకరిస్తున్న నారా లోకేష్

వైసిపి పాలనతో రాష్ట్రం 30 ఏళ్ల వెనక్కి

- గుంటూరులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో లోకేష్ రాజకీయ ఉపన్యాసం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గత ప్రభుత్వ తప్పిదాల వల్ల రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందని రాష్ట్ర మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేష్ విమర్శించారు. గుంటూరు పోలీసు పేరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. తొలుత జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. సహజంగా స్వాతంత్ర్య దినోత్సవంలో అధికారులు రాసి ఇచ్చిన ప్రసంగ పాఠాలను చదవడం ఇప్పటి వరకు అనవాయితీ కాగా మంత్రి లోకేష్ తొలిసారిగా ఈ ప్రసంగ పాఠాన్ని పక్కన పెట్టి సాధారణ, రాజకీయ, స్వాతంత్ర్య ఘట్టాలను, తన చిన్ననాటి జ్ఞాపకాలను ప్రస్తావించారు. 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో చీకటి పాలన జరిగిందని విమర్శించారు. గత ప్రభుత్వ హయంలో రూ. పది లక్షల కోట్లు అప్పులు చేసి అభివృద్ధిలో 30 ఏళ్లు వెనక్కి నెట్టారన్నారు. అందువల్లే వైసిపి అడ్రస్సు లేకుండా పోయిందని పేర్కొన్నారు. 2024లో ప్రజలు చరిత్ర సృష్టించి టిడిపి కూటమి 164 సీట్లు కట్టబెట్టారన్నారు. డబుల్ ఇంజన్ సర్కారుతో రాష్ట్రం చీకటి నుంచి వెలుగు వైపు తొలి అడుగు వేసిందని చెప్పుకొచ్చారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అందులో భాగంగా పలు బడా కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని అన్నారు.

తల్లికి వందనం పథకం ద్వారా 67.27 లక్షల మందికి రూ.10,091 కోట్లు అందించామన్నారు. అన్నదాతా సుఖీభవలో తొలి విడత రూ.ఏడు వేలు ఇచ్చామని తెలిపారు. ఇచ్చిన హామీల మేరకు పింఛన్ల సొమ్ము పెంచామన్నారు. మహిళలకు ఉచిత బస్సును ప్రారంభించామని తెలిపారు. ఉచితంగా మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఇచ్చామన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో రాష్ట్రం పురోగమనంలో పయనిస్తుందని, విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తెచ్చామని వివరించారు. జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, ఎమ్మెల్యేలు గళ్ళా మాధవి, రామాంజనేయులు, నశీర్ అహ్మద్, తెనాలి శ్రావణ్‌కుమార్, ఐజి సర్వశ్రేష్ట త్రిపాఠి పాల్గొన్నారు.

తాగునీరూ కరువే!

- స్మశాన వాటిక లేక కొండపక్కన అంత్యక్రియలు
- వైద్యం కోసం ఏడు కిలోమీటర్లు వెళ్లాల్సిందే...
- ఇదీ పోలవరం పునరావాస కాలనీ దుస్థితి


పోలవరం నిర్వాసిత పెనికెలపాడు పునరావాస కాలనీ

ప్రజాశక్తి- దేవీపట్నం (అల్లూరి జిల్లా)

పోలవరం ప్రాజెక్టు కోసం సర్వస్వం త్యాగం చేసిన వారి పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇటు దేవీపట్నం నుంచి అటు ఎటపాక మండలం వరకూ పలుచోట్ల నిర్మించిన పునరావాస కాలనీల్లో నిర్వాసితులకు సౌకర్యాలు మృగ్యమయ్యాయి. తాగునీరు కూడా ఇక్కడి వారికి అందడం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దేవీపట్నం మండల వాసులు పోలవరం ప్రాజెక్టు ప్రారంభానికి ముందు తమ స్వస్థలాల్లో ఎంతో ఆనందంగా గడిపేవారు. వారికి చట్టబద్ధంగా పరిహారం, పునరావాసం కల్పించిన తర్వాతే ప్రాజెక్టు పనులు ప్రారంభించాల్సిన పాలకులు అందుకు భిన్నంగా వ్యవహరించారు. 16 రకాల మౌలిక వసతులు పునరావాస కాలనీల్లో కల్పించాల్సి ఉన్నా, అవెక్కడా పూర్తి స్థాయిలో కానరావడం లేదు. దేవీపట్నం మండలం పెనికెలపాడు పునరావాస కాలనీలో మెట్ట వీధి, మూలమెట్ట ప్రాంతాలు ఉన్నాయి. ఇక్కడ సుమారు 112 ఇళ్లను ప్రభుత్వం నిర్మించింది. వాటిలో 120 మంది కుటుంబాల వారు నివసిస్తున్నారు. ఇంకా 38 మంది కుటుంబాల వారికి ఇళ్లు ఇవ్వాలని, 30 మంది యువతీయువకులకు 18 సంవత్సరాలు నిండిన ప్యాకేజీ రావాలని నిర్వాసితులు చెబుతున్నారు. మండల కార్యాలయాలు ఉన్న ఇందుకూరిపేటకు ఈ పునరావాస కాలనీ నుంచి వెళ్లి, వచ్చేందుకు సరైన రహదారి లేదు. ఏదైనా అవసరమైతే ఏడు కిలోమీటర్ల మేర ఇబ్బందులు పడుతూ వెళ్లాల్సిందే. మూడు కిలోమీటర్ల మేర దారి మరీ అధ్వానంగా ఉంది. ఇక్కడివారి గృహాలను కాంట్రాక్టరు పూర్తి స్థాయిలో నిర్మించలేదు.

చాలా ఇళ్లకు ప్లాస్టింగ్ వర్క్ జరగలేదు. దీంతో, నిర్వాసితులే సొంత డబ్బులు పెట్టుకుని పనులు చేయించుకుని నివాసయోగ్యంగా మార్చుకున్నారు. తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. సుమారు ఏడు కిలోమీటర్లు వెళ్లి రూ.10 వెచ్చించి ఫిల్టర్ వాటర్‌ను కొనుక్కుని తెచ్చుకొని తాగాల్సి వస్తోంది. తాగునీటికే ఒక్కో కుటుంబం నెలకు రూ.600 వరకూ ఖర్చు చేయాల్సి వస్తోంది. కాలనీలో మరుగుదొడ్లు లేవు. దీంతో, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్మశాన వాటిక లేకపోవడంతో సమీపంలోని కొండప్రాంతంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమకు అన్ని వసతులూ కల్పించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

తాగునీరు లేక వ్యాధుల బారిన పడుతున్నాం



మాకు తాగునీరు కరువైంది. తరుచూ అనారోగ్యానికి గురవుతున్నాం. మంచినీటి కోసం ఏడు కిలోమీటర్ల దూరంలోని ఇందుకూరుపేటకు వెళ్లి ఫిల్టర్ వాటర్ కొని తెచ్చుకోవాల్సి వస్తోంది.

-కె.రామలక్ష్మి

సరైన రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నాం



పోతవరం నుండి మా కాలనీకి సరైన రోడ్డు లేదు. రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది. అత్యవసర పరిస్థితుల్లో మా కష్టం వర్ణించలేనిది. ప్రభుత్వం రోడ్డు సదుపాయం కల్పించాలి.

-జీడి రామయమ్మ

స్మశాన వాటిక ఏర్పాటు చేయాలి



మా కాలనీలో ఎవరైనా మరణిస్తే వారి అంత్యక్రియలు చేయడానికి ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి మా కాలనీకి స్మశాన వాటిక ఏర్పాటు చేయాలి.

-కారం పోచమ్మ

నేడు, రేపు 'పోలవరం'లో ఎంఎ బేబీ, బ్రిట్టాస్ పర్యటన

సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ, రాజ్యసభ ఎంపి, సిపిఎం ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిట్టాస్ పోలవరం ప్రాంతంలో శని, ఆదివారాల్లో పర్యటించనున్నారు. ప్రాజెక్టు నిర్వాసిత, మునక ప్రాంతాల సమస్యలను ఇరువురూ పరిశీలించనున్నారు. బేబీ శనివారం రాజమండ్రి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ్నుంచి దేవీపట్నం మండలంలోని పెనికెలపాడు, ఇందుకూరు, తాళ్లూరు ప్రాంతాల్లోని నిర్వాసిత కాలనీల్లో పర్యటిస్తారు. జాన్ బ్రిట్టాస్ శనివారం విజయవాడ చేరుకొని అక్కడ్నుంచి ఏలూరు జిల్లాలోని జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం మండలాల్లో ప్రజల్ని కలుసుకొని వారి సమస్యలు అడిగి తెలుసుకుంటారు. 17న ఇద్దరూ కలిసి చింతూరు, విఆర్ పురం, కూనవరం, ఎటపాక మండలాల్లో పర్యటిస్తారు.

జిల్లా చరిత్రను తెలిపే 'బాపట్ల గీతం'

- ఆవిష్కరించిన మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా చరిత్ర, వైభవాన్ని తెలియజేసే 'బాపట్ల జిల్లా గీతాన్ని' రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ జె వెంకటమురళిఆవిష్కరించారు. బాపట్ల మహిళ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో శుక్రవారం జరిగిన స్వాతంత్ర దినోత్సవంలో వీరిద్దరూ కలసి పాట సిడిని ఆవిష్కరించారు. రచయితలకు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి పోటీలు నిర్వహించారు. అందులో నందిరాజు విజయ్ కుమార్ రచించిన ఉత్తమమైన గీతాన్ని ఎంపిక చేశారు. జె నాగపూర్ణ, రమాదేవి స్వరకల్పనతో సంజయ్ కుమార్, రమాదేవి, కుమారి కీర్తి, స్వాతిలు గానం చేసిన గీతాన్ని వేదికపై ప్రదర్శించారు.

ఈ పాటను రూపొందించడంలో ఫోరం ఫర్ బెటర్ బాపట్ల, విఆర్ క్రియేషన్స్ వారు విశేషంగా కషి చేశారని మంత్రికి కలెక్టర్ తెలిపారు.



బాపట్ల జిల్లా గీతాన్ని ఆవిష్కరిస్తున్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి

అతిథులకు మంత్రి సిడిని అందజేశారు. జిల్లా చరిత్ర, ప్రాశస్త్యాన్ని వెలుగులోకి తీసుకురావడం, జిల్లా అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్‌ను మంత్రి రవికుమార్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు పోతుల సునీత, బాపట్ల, చీరాల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ, ఎం మాలకొండయ్య, ఎపి చేనేత కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ సజ్జల హేమలత, జిల్లా ఎస్‌పి తుషార్‌డూడీ, ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్, డిఆర్‌ఓ జి గంగాధర్‌గౌడ్, జిల్లా అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

త్వరలో జిఎస్‌టిలో రెండే శ్లాబులు

- కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడి
- బీహార్ ఎన్నికల స్టంట్...!

న్యూఢిల్లీ : వచ్చే దీపావళి కల్లా వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)లో రెండు శ్లాబులను అమల్లోకి తేనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. సంస్కరణల్లో భాగంగా పన్ను భారాన్ని తగ్గించడం, వినియోగదారులకు, వ్యాపారాలకు సౌలభ్యం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. ప్రధాని మోడీ నేతృత్వంలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ ప్రతిపాదనలపై చర్చించినట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. ఇవి దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు సామాన్య ప్రజలకు ఊరటనిచ్చే లక్ష్యంతో రూపొందించబడ్డాయన్నారు. ప్రస్తుతం జిఎస్‌టిలో 5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతం చొప్పున నాలుగు శ్లాబులు అమల్లో ఉన్నాయి. అదే విధంగా కొన్ని వస్తువులపై సున్నా, లగ్జరీ వస్తువులపై సెస్ విధించబడుతుంది. కేంద్రం ప్రతిపాదిస్తున్న రెండు రేట్ల విధానం ఈ స్లాబ్‌లను సరళీకంచే క్రమంలో వినియోగ వస్తువులకు తక్కువ రేటు, లగ్జరీ వస్తువులకు ఎక్కువ రేటును అమలు చేయాలని యోచన. నిత్యావసర వస్తువులు, ఆహార ఉత్పత్తులు, ఆరోగ్య సంబంధిత వస్తువులపై జిఎస్‌టి రేట్లను తగ్గించే ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ చర్య వినియోగదారులకు అధిక ధరల నుంచి ఉపశమనం కలిగించడంతో పాటు, గ్రామీణ, నగర ప్రాంతాల్లో డిమాండ్‌ను పెంచుతుందని ప్రభుత్వ వర్గాల అంచనా. ఈ సంస్కరణలు అమల్లోకి వస్తే భారత ఆర్థిక వ్యవస్థలో వినియోగం పెరిగే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ఈ ప్రతిపాదనలకు జిఎస్‌టి కౌన్సిల్ తదుపరి సమావేశంలో ఆమోదం లభించాల్సి ఉంటుంది. త్వరలో జరగనున్న బిహార్ ఎన్నికల నేపథ్యంలో ప్రధాని మోడీ ఈ ప్రకటన చేశారని నిపుణులు అనుమానిస్తున్నారు. అధిక ధరలపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తోన్న నేపథ్యంలో బిజెపికి ఎదురుదెబ్బ తగలకుండా ఈ ప్రతిపాదన చేసి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

బ్యాంక్‌ల రేటింగ్‌ను పెంచిన ఎస్‌అండ్‌పి

న్యూఢిల్లీ : అంతర్జాతీయ రేటింగ్ ఎజెన్సీ ఎస్‌అండ్‌పి భారత్‌లోని పలు బ్యాంక్‌లు, బ్యాంకింగేతర విత్త సంస్థల రేటింగ్‌ను పెంచింది. ఈ జాబితాలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బిఐ), హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌తో సహా మరో ఎనిమిది సంస్థలు ఉన్నాయి. ఈ రేటింగ్‌ను పెంచడం ద్వారా భారతదేశ ఆర్థిక రంగం వృద్ధి, మెరుగైన ఆస్తుల నాణ్యత, పటిష్టమైన మూలధన నిల్వల విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుని ఎస్‌అండ్‌పి పేర్కొంది. ఎస్‌బిఐ, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌ల దీర్ఘకాల రేటింగ్‌ను బిబిబి- నుంచి బిబిబికి అప్‌గ్రేడ్ చేసింది. ఐసిఐసిఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, కొటాక్ మహీంద్రా బ్యాంక్‌తో సహా మరో ఐదు సంస్థల రేటింగ్‌లో మార్పులు చేసింది. రాబోయే రెండేళ్లలో బ్యాంకులు సంవత్సరానికి 14-16 శాతం రుణ వృద్ధిని నమోదు చేయొచ్చని ఎస్‌అండ్‌పి అంచనా వేసింది.

సంపాదకీయం

మొట్టికాయ!

బీహార్‌లో ఎస్‌ఐఆర్ పేరిట తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలను ప్రచురించాలని, ఎందుకు తొలగించాల్సివచ్చిందో ఆ కారణాలను కూడా తెలియపరచాలని సుప్రీంకోర్టు ఆదేశించడం ఎన్నికల సంఘానికి, వారి నిర్వాకాన్ని బలపరుస్తున్న పరివారానికీ మొట్టికాయలు వేయడం వంటిదే! ఎస్‌ఐఆర్ ప్రక్రియను వ్యతిరేకిస్తున్న ప్రతిపక్ష పార్టీలకు ఇది నైతిక విజయం. 2025 ఓటర్ల జాబితాలో వుండి ఎస్‌ఐఆర్ ప్రక్రియ అనంతరం ప్రచురించిన ముసాయిదా జాబితాలో తొలగింపునకు గురైన ఓటర్ల వివరాలను, అందుకు గల కారణాలను వివరిస్తూ ఈ నెల 19లోపు ప్రత్యేకంగా ప్రచురించాల్సిందిగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఇసిని ఆదేశించింది. అలాగే తమ ఆదేశాల అమలుకు తీసుకున్న చర్యలపై 22 నాటికి ఒక నివేదికను అందజేయాలని కూడా సుప్రీం ఆదేశించడం పరిస్థితి తీవ్రతకు, ఇసి నిర్వాకానికీ అద్దం పడుతుంది. మరణించారు కనుక వారి ఓట్లు తొలగించామని ఎన్నికల కమిషన్ చెబుతున్న వ్యక్తులను ఏకంగా సర్వోన్నత న్యాయస్థానం ముందు పిటిషనర్లు నిలబెట్టడంతో ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. మరణించినవారు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారి వివరాలను ప్రకటిస్తే వారు 30 రోజుల్లోగా పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు అవకాశం వుంటుందని పేర్కొనడం ప్రజాస్వామ్య ప్రక్రియకు మౌలికమైన ఓటు హక్కు కల్పన పట్ల సుప్రీం కనబరుస్తున్న ప్రాధాన్యతను ప్రతిబింబిస్తుంది. అలాగే ఆధార్, ఓటరు గుర్తింపు కార్డులను పరిగణనలోకి తీసుకోవాల్సిందేనని సుప్రీం ఆదేశించడం స్వాగతించదగినది.

మరణాలు, వలసలు వంటి కారణాలతో బీహార్‌లో ముసాయిదా ఓటర్ల జాబితా నుండి తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల జాబితాను ఆన్‌లైన్‌లో అందుబాటులో వుంచుతామని ఎన్నికల కమిషన్ ఎట్టకేలకు తెలియజేయవలసి వచ్చింది. ప్రతి జిల్లా ఎన్నికల అధికారి వెబ్‌సైట్‌లోనూ అలాగే రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్‌లోనూ ఈ వివరాలు పెట్టాలని, తొలగింపునకు కారణాలు కూడా వెల్లడించాలని బెంచ్ ఆదేశించింది. కేవలం వెబ్‌సైట్లకే పరిమితం కారాదనీ పంచాయతీ భవనాల్లో సైతం ప్రజలకు అందుబాటులో వుంచాలని పేర్కొంది. ఈ మొత్తం ప్రక్రియకు బాగా ప్రచారం కల్పించాలని, బీహార్ దినపత్రికల్లో ప్రచురించాలని, దూరదర్శన్‌లో, ఆకాశవాణిలో కూడా ప్రసారం చేయాలని ఆదేశించడమేగాక జిల్లా ఎన్నికల అధికారికి సోషల్ మీడియా హ్యాండిల్ ఏదైనా వుంటే అందులో కూడా ఈ జాబితాను ప్రదర్శించాలని బెంచ్ కోరింది. ఈ ప్రక్రియ ఆ రాష్ట్రంలోని ప్రతివారికీ తెలియడం మాత్రమేగాక బీహార్ వాసులు ఎక్కువగా వలస వెళ్లే ప్రాంతాల్లోనూ ప్రచారం చెయ్యాలని సుప్రీం ఆదేశించడం వాస్తవికతకు చేరువగా వుంది.

ఎస్‌ఐఆర్‌ను పకడ్బందీగా రూపొందించామని గుండెలమీద చెయ్యి వేసుకొని చెప్పగలిగిన పరిస్థితి ఇసికి కూడా లేదు. ఎందుకంటే ఒకే ఇంటి నెంబరుతో 240 ఓట్లు నమోదు చేసిన ఘనత దానిది! అనేకమంది ఓటర్లకు అసలు ఇంటి నెంబరే లేదు. అంతేగాక చాలామందివి ఫొటోలు సైతం గల్లంతైన పరిస్థితి. ఆ ఓటర్లు మరణించారని ఇసి చెబుతున్నవారితో కలిసి రాహుల్ గాంధీ టీ తాగిన ఫొటోలు, వీడియోలు చూసిన ప్రజలకు ఎస్‌ఐఆర్ పేరిట ఎంత దగా జరుగుతున్నదో బోధపడింది. బీహార్‌లో అమలు చేసిన ఎస్‌ఐఆర్‌ను దేశమంతటికీ విస్తరింపజేస్తామని ప్రకటించిన ఎన్నికల కమిషన్ ఇప్పటికైనా తన ప్రయత్నాలు మానుకోవాలి. ఇది తుది తీర్పు కాకపోయినా ధర్మాసనం చేసిన వ్యాఖ్యలతోనైనా ఇసి తన వైఖరి మార్చుకోవడం అవసరం. ఇసిని ఎస్‌ఐఆర్‌ను అడ్డగోలుగా బలపరుస్తున్న పరివార్ శక్తులు ఇప్పటికైనా బుద్ధెరగాలి. వామపక్షాలు, ఇండియా బ్లాక్ ఎస్‌ఐఆర్ ను తొలినుండీ వ్యతిరేకిస్తూనే వున్నాయి. ఎస్‌ఐఆర్‌ను పౌరసత్వంతో ముడిపెట్టరాదని టిడిపి ప్రతినిధి బృందం గతంలో ఎన్నికల కమిషన్‌ను కోరింది. కానీ వైఎస్‌ఆర్‌సిపి మాత్రం తన వైఖరిని వెల్లడించకపోవడం తగదు. ఇప్పుడైనా ముదనష్టపు ఎస్‌ఐఆర్‌ను వ్యతిరేకించడం అవసరం. ఎస్‌ఐఆర్‌కు వ్యతిరేకంగా న్యాయ పోరాటం మాత్రమే చాలదు. ప్రజా క్షేత్రంలోనూ ఆందోళనలు సాగించాలి. అందుకు ప్రజాస్వామ్య ప్రియులంతా విశాల ఐక్యతతో ఉద్యమించడం తక్షణ కర్తవ్యం.

మహనీయుల మాట



సమాజం కొద్ది మంది మీద ఆధారపడి నడవదు. లేదా అదృష్టం వల్లనో, విధి ఫలితం వల్లనో నడవదు. పౌరుల చైతన్యపూర్వక కార్యాచరణ వల్ల నడుస్తుంది.

- ఆంటోనియో గ్రాంసీ,
ఇటాలియన్ మార్క్సిస్టు తత్వవేత్త, రాజకీయవేత్త.

Antonio Gramsci

భారత పౌరులు, స్వాతంత్ర్య పరిరక్షణ

వ్యాఖ్య

మన రాజ్యాంగ పరిషత్తు చర్చలను పునర్దర్శించడానికి స్వాతంత్ర్య దినోత్సవం సరైన సందర్భంగా ఉంటుంది. ఆ సభలో ప్రధానంగా భారత స్వాతంత్ర్య పోరాట యోధులు ఉండేవారు. వారంతా మన చరిత్ర లోతుపాతులు, సామాజిక వాస్తవాలు, సాంస్కృతిక సాంప్రదాయాలు బాగా ఎరిగినవారు. చరిత్రలో మానవ ప్రగతి, సమకాలీన ప్రపంచ పరిస్థితులు బాగా తెలిసిన వారు కూడా.

ఆ సమయంలో వారి ముందున్న చారిత్రక సవాలు రెండు ప్రధానమైన ప్రశ్నలుగా రూపుదాల్చింది: ఇంత అపారమైన వైవిధ్యంతో కూడిన మహా విస్తార జనాభాకు పురోగమనశీలమైన, అభ్యుదయకరమైన రాజ్యాన్ని నిర్మించడం ఎలా?

పీఠికలోనే సందేశం

దానిపై వారు ఒక విలక్షణమైన పరిష్కారం కనుగొన్నారు. ఈ మొత్తం కసరత్తుకు పౌరసత్వాన్ని గుండెకాయగా చేశారు. స్వతంత్ర భారతంలో ఒక ఉమ్మడి సమాన పౌరసత్వమే సర్వజనులకు ఉండాలని నిర్ణయించారు. దేశంలోని బహుముఖీనతను పాటించాలని, విభిన్నతలతో నిండిన అనేక దొంతరలను పాటించరాదని తేల్చారు.

ఆ తర్వాత రాజ్యాంగం పీఠిక ఈ దృక్పథాన్ని మరింత పటిష్టం చేసేలా రూపొందింది:

"భారతదేశ ప్రజలమైన మేము భారతదేశాన్ని సార్వభౌమిక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా ఏర్పాటు చేసుకోవాలని, తన పౌరులందరికీ సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయం, భావాలు, వ్యక్తీకరణలు నమ్మకాలు విశ్వాసాలు పూజారీతులకు సంబంధించిన స్వేచ్ఛ: ప్రతిపత్తిలోనూ అవకాశాల్లోనూ సమానత్వం: వారిలో సౌభ్రాతృత్వాన్ని: వ్యక్తి గౌరవం, జాతి సమైక్యత సమగ్రతలకు హామీ ఇచ్చే విధంగా పెంపొందించాలని మా రాజ్యాంగ పరిషత్తులో ఈ 1949 నవంబర్ 26వ రోజున దృఢంగా నిర్ణయించుకొని దీని ద్వారా ఆమోదించి, శాసనబద్ధం చేసి, మాకు మేము ఈ రాజ్యాంగాన్ని సమర్పించుకుంటున్నాము."

పీఠికలో ఉన్న ఈ కథను వాస్తవంలోకి అనువదించాలంటే సహజంగానే ప్రాతినిధ్య ప్రభుత్వ స్థాపనలో ప్రతి పౌరుడికి తనదైన భాగం ఉందనే భావన కలిగేలా హామీ కల్పించబడాలి. వ్యక్తిగత ఓటింగ్ ద్వారా ప్రజలు ఆ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి. ఆ ప్రభుత్వం అధ్యక్ష తరహాగా ఉండరాదని, మంత్రివర్గ వ్యవస్థతో పార్లమెంటరీ తరహా ప్రభుత్వంగా ఉండాలని రాజ్యాంగ నిర్మాతలు నిర్ధారించినట్టు ఆ సభ చర్చలను పరిశీలించిన వారెవరికైనా స్పష్టమవుతుంది.

> **ఈ రోజున ఆర్.ఎస్.ఎస్ ప్రస్తుత ప్రభుత్వాన్ని నడిపిస్తున్న కార్పొరేట్ మతతత్వ దుష్ట కూటమికి అగ్రభాగాన నిలిచి ఉంది. స్వతంత్ర రాజ్యాంగ అధికార వ్యవస్థలను ప్రత్యక్షంగా పరోక్షంగా దెబ్బతీయ చూస్తున్న నయా ఫాసిస్టు ధోరణులకు ఇదే మూల వనరుగా ఉంది. బీహార్‌లో ప్రత్యేక సమగ్ర పరిశీలన (ఎస్.ఐ.ఆర్) పేరిట ఓటు హక్కును పౌరసత్వంతో ముడి పెట్టేందుకు ఎన్నికల సంఘం చేస్తున్న మోసంలోనూ ఇదే కీలకం. తర్వాత ఇదే ప్రక్రియ దేశమంతా అమలు చేయాలనేది కూడా కమిషన్ పథకంగా ఉంది.**



PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

తదనుగుణంగానే రాజ్యాంగం పార్లమెంటరీ తరహా ప్రభుత్వం సమాఖ్య చట్రంతో, కొన్ని కేంద్ర పాలన లక్షణాలతో రూపొందించబడింది. కేంద్ర కార్యనిర్వాహక వర్గానికి రాజ్యాంగ అధినేతగా రాష్ట్రపతి ఉంటారు. భారత రాజ్యాంగం 79వ అధికరణం ప్రకారం కేంద్ర పార్లమెంట్‌లో రాష్ట్రపతి, ఉభయ సభలు అంటే రాష్ట్రాల సభగా రాజ్యసభ, ప్రజల సభగా లోక్‌సభ ఉంటాయి.

ఎన్నికల ప్రక్రియ

ఈ పార్లమెంటరీ తరహాను ఆమోదించడం ద్వారా రాజ్యాంగం ఎన్నికల ప్రక్రియను నిర్ధారించటం మొదలు పెట్టింది. ఎవరినీ పక్కన పెట్టని సార్వత్రిక వయోజన ఓటింగ్ ఉండాలని నిర్ణయించింది. ఈ విషయంలో 326వ అధికరణంలో ఇలా జొప్పించబడింది: "ప్రజల సభకు, రాష్ట్రాలలోని శాసనసభలకు వయోజన ఓటు హక్కు ప్రాతిపదికగా ఉంటుంది. అంటే దాని అర్థం భారత పౌరుడైన, ఆ రోజుకు 18 ఏళ్ల లోపు వయస్సు దాటిన ప్రతి వ్యక్తి (అక్కడ నివాసం లేకపోవడం, మతి స్థిమితం లేకపోవడం, నేరం లేదా అవినీతి, చట్టవిరుద్ధ పద్ధతుల వంటి వాటి ప్రాతిపదికన సంబంధిత చట్టసభ చేసే చట్టం ప్రకారం లేదా దాని తరఫున నిర్ణయించే అనర్హతలకు గురికాని ప్రతి వ్యక్తి) అలాంటి ఎన్నిక ఏదైనా ఓటరుగా నమోదు కావడానికి హక్కు కలిగి ఉంటారు".

ఉత్తరోత్తరా సుప్రీంకోర్టు సార్వత్రికతను మరింత నొక్కి చెప్పింది. ఓటు చేసే హక్కు రాజ్యాంగ హక్కు అని నిర్దిష్టంగా వక్కాణించింది.

ఆ తర్వాత రాజ్యాంగం రాజకీయ పార్టీల ప్రభావం సోకకుండా రక్షణలతో సుదృఢమైన, స్వతంత్రమైన ఎన్నికల సంఘం ఏర్పాటుకు చోటు కల్పించింది. అందరికీ సమాన అవకాశాలతో ఎన్నికలు న్యాయంగా స్వేచ్ఛగా జరగడానికి జరిగినట్టు కనిపించడానికి ఇది అత్యవసరమైనది. 324 అధికరణం ఇలా పేర్కొంటున్నది. "పార్లమెంటుకు, అన్ని రాష్ట్రాల శాసనసభలకు, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి స్థానాలకు జరిగే అన్ని ఎన్నికల ఓటర్ల జాబితాల తయారీకి సంబంధించి పర్యవేక్షణ, నిర్దేశం, నియంత్రణకు ఎన్నికల కమిషన్‌కు అధికారంగా ఉండాలని ఈ రాజ్యాంగం నిర్దేశించింది. ఎన్నికల సంఘంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సి.ఇ.సి), అలాగే ఎప్పటికప్పుడు రాష్ట్రపతి నిర్ణయించిన సంఖ్యలో ఎలక్షన్ కమిషనర్లు ఉంటారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకాలు, నియామకం పార్లమెంట్ చేసే చట్టానికి, రాష్ట్రపతి నిర్ణయాలకు లోబడి చేసే చట్టాలలోని నిబంధనల ప్రకారం ఎన్నికల కమిషనర్ల, ప్రాంతీయ కమిషనర్ల సర్వీసు నిబంధనలు పదవీ కాలం నిర్ణయం అవుతాయి. సుప్రీంకోర్టు న్యాయమూర్తి తరహాలో అలాంటి కారణాలతో తప్ప ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను అధికారం నుంచి తప్పించడానికి వీలుండకూడదు. ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకం తర్వాత సర్వీస్ పరిస్థితులను ఆయనకు అనుకూలంగా ఉండేట్టు మార్చకూడదు. తక్కిన ఎన్నికల కమిషనర్లు రాష్ట్రాల ఎన్నికల కమిషనర్లు కూడా ప్రధాన ఎన్నికల కమిషనర్ సిఫార్సు మేరకు తప్ప పదవి నుంచి తప్పించడం జరగరాదు".

కనుక రాజ్యాంగ సూత్రాల చట్టం సార్వజనీనతను నొక్కి చెబుతున్న విషయం స్పష్టం. పౌరసత్వం లేకపోవడం అన్నది కేవలం మినహాయింపు మాత్రమే. అర్హతను నిర్ధారించే బాధ్యత ఎన్నికల సంఘానికి అప్పగించలేదు. మొదటి నుంచి కూడా తొలి ఎన్నికల సంఘం రూపొందించిన రెండు ప్రాథమిక సూత్రాలపై ఆధారపడి కమిషన్ పని చేస్తూ వచ్చింది 1. ఎన్నికలు సార్వత్రికతకు హామీనివ్వాలి. 2. ఓటర్ల జాబితాలో చేర్చడం అన్నది కేవలం వ్యక్తిగతంగా పౌరుడి బాధ్యతగా ఉండకూడదు.

ఏమైనా ఇప్పుడు పెద్ద వివాదం వచ్చింది. పౌరసత్వ సవరణ చట్టం (సి.ఏ.ఏ) తో మొదలుపెట్టి జాతీయ పౌరసత్వ రిజిస్టర్ (ఎన్.ఆర్.సి) తో కొనసాగిన ప్రభుత్వ చర్యలలోనే దీనికి మూలాలు ఉన్నాయి. సిఏఏ విభజనాత్మకమైన వివక్షా పూరితమైందిగా విస్తృతంగా నిరూపితమైంది. దాన్ని అధికారికంగా అమలు ప్రకటించటం జరగకపోగా ఎన్.ఆర్.సి ప్రక్రియ నిలిచిపోయింది. ఇవి రెండూ రాజ్యాంగం రూపొందించిన ఉమ్మడి సమాన పౌరసత్వ భావనకు విరుద్ధమైనవన్న ఆందోళనే వీటికి వ్యతిరేకత రావడానికి మూలం.

> **అందుకే స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవడంతో పాటు పౌరసత్వ పరిరక్షణ, ఉమ్మడి సమాన పౌరసత్వం పరిరక్షణ కూడా తప్పక జరుపుకోవాలి. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమాఖ్యవాదం, మన భిన్నత్వంలో ఏకత్వం కాపాడుకోవాలి. ఈ స్వాతంత్ర్య దినోత్సవ సమర శంఖారావం ఇదే.**

ఆర్.ఎస్.ఎస్ భావజాలమే అది

ఆర్.ఎస్.ఎస్ పాత్రను చారిత్రిక సందర్భంతో చూడటం అవసరం. పుట్టినప్పటి నుంచి ఆర్.ఎస్.ఎస్ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య లౌకిక గణతంత్రాన్ని ఆమోదించడానికి నిరాకరించింది. హిందూ రాష్ట్ర అనే హిందూ జాతీయ వాదంపై ఆధారపడిన ఈ భావజాలం ఇస్లామిక్ జాతీయవాదానికి ప్రతిరూపం వంటిదే. ఇస్లామిక్ రాజ్యాంగ పాకిస్తాన్ ఏర్పడడానికి దారితీసింది అదే. జాతీయవాదం, రాజ్యం గురించిన ఈ రెండు భావనలు "విభజించి పాలించు" అన్న బ్రిటిష్ వలసవాద విధానం నుంచి ప్రత్యక్షంగా పుట్టినవే. బ్రిటిష్ వలసవాద చరిత్రకారులు భారతదేశ గతం హిందూ ముస్లింల మధ్య మాత్రమే సాగిన ఘర్షణగా ఒక కథనాన్ని సృష్టించారు. ఇది చరిత్రను వక్రీకరించింది. మత ప్రాతిపదికన జాతీయవాదం. మరింత బలపడటానికి, అంతిమంగా పాకిస్తాన్ ఏర్పడడానికి కారణమైంది. భారత స్వాతంత్ర్యం ప్రాధాన్యతను తగ్గించి వేసిన ఈ ఫలితం మానని గాయంగా మిగల్చబడింది.

రాజ్యాంగ నిర్మాతలు ఈ విభజన ఎజెండాను వెనక్కి కొట్టడం విద్యుక్త ధర్మంగా భావించారు. అయినా 78 ఏళ్ల స్వాతంత్ర్యం తరువాత ఆర్.ఎస్.ఎస్ ఇదే సంకుచితమైన ఒంటెద్దు ఫాసిస్టు తరహా హిందూ రాష్ట్ర దృక్పథాన్ని పట్టుకొని వేలాడుతున్నది. ప్రజాస్వామ్య లౌకిక గణతంత్రానికి దాన్ని పోటీగా చూపిస్తున్నది. ఇది ఎంత విషపూరితమైందంటే ఆర్.ఎస్.ఎస్ భావజాలంతో ముడిపడిన ఒక గవర్నర్ కేరళలో ఆగస్టు 14న "దేశ విభజన దినం"గా అధికారికంగా పాటించేంత వరకూ వెళ్లారు.

నేటి కర్తవ్యం

ఈ రోజున ఆర్.ఎస్.ఎస్ ప్రస్తుత ప్రభుత్వాన్ని నడిపిస్తున్న కార్పొరేట్ మతతత్వ దుష్ట కూటమికి అగ్రభాగాన నిలిచి ఉంది. స్వతంత్ర రాజ్యాంగ అధికార వ్యవస్థలను ప్రత్యక్షంగా పరోక్షంగా దెబ్బతీయ చూస్తున్న నయా ఫాసిస్టు ధోరణులకు ఇదే మూల వనరుగా ఉంది. బీహార్‌లో ప్రత్యేక సమగ్ర పరిశీలన (ఎస్.ఐ.ఆర్) పేరిట ఓటు హక్కును పౌరసత్వంతో ముడి పెట్టేందుకు ఎన్నికల సంఘం చేస్తున్న మోసంలోనూ ఇదే కీలకం. తర్వాత ఇదే ప్రక్రియ దేశమంతా అమలు చేయాలనేది కూడా కమిషన్ పథకంగా ఉంది.

అందుకే స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవడంతో పాటు పౌరసత్వ పరిరక్షణ, ఉమ్మడి సమాన పౌరసత్వం పరిరక్షణ కూడా తప్పక జరుపుకోవాలి. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమాఖ్యవాదం, మన భిన్నత్వంలో ఏకత్వం కాపాడుకోవాలి. ఈ స్వాతంత్ర్య దినోత్సవ సమర శంఖారావం ఇదే.


/ ఆగస్టు13 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం /

పచ్చని పంట పొలాలను కంపెనీలకు కట్టబెడతారా?

విశ్లేషణ

కరేడు! ఆంధ్ర రాష్ట్రంలో నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గం ఉలవపాడు మండలంలో 18 మజరా గ్రామాలతో ఉన్న గ్రామం. జూన్ 29వ తేదీకి ముందు వరకు ప్రకాశం, నెల్లూరు జిల్లా వాసులకు మాత్రమే పరిచయం. కానీ నేడు కరేడు పేరు రాష్ట్రమంతటా చర్చనీయాంశంగా వున్నది.

18 గిరిజన, దళిత, మత్స్యకార పల్లెలతో 16 వేల జనాభాతో 11 వేల పైచిలుకు ఓట్లతో నెల్లూరు జిల్లాలో పెద్ద గ్రామ పంచాయతీ కరేడు. పచ్చని పంట పొలాలకు, మామిడి, జీడి మామిడి, అరటి, కొబ్బరి తోటలకు ఆలవాలంగా ఉన్నది. సముద్రానికి కిలోమీటర్ దూరంలోనే 15, 20 అడుగుల లోతులో భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి. సముద్రానికి అతి దగ్గరలో ఉన్నా భూగర్భ జలాలు మాత్రం అతి మధురంగా ఉంటూ వేరుశనగ, వరి, చామ, మినుము తదితర అనేక పంటలకు ప్రధాన నీటి వనరుగా ఉంది. 1300 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కరేడు గ్రామ చెరువు కరేడు గ్రామ ప్రజలకు మాత్రమే కాకుండా చుట్టూ పది కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండే ఇతర గ్రామాల ప్రజలకు సాగు, తాగునీటిని అందిస్తున్న మంచినీటి చెరువుగా ప్రసిద్ధి గాంచింది. ఈ నీరే వారికి జీవనాధారం. జన జీవనానికి, పశుపోషణకు, పంటల సాగుకు ఎంతగానో ఉపయోగపడుతున్న ఈ చెరువు గ్రామ ప్రజల జీవనాడిగా ఉన్నది.



కె. ప్రభాకర రెడ్డి

కరేడు గ్రామంలో ఇండోసోల్ సోలార్ పరిశ్రమ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. దాంతో, అనేక కులాలు, మతాల వారందరూ కలిసి అన్యోన్యంగా జీవిస్తున్న కరేడు గ్రామ ప్రజల జీవితాలలో కలకలం రేగింది. గత వైసిపి ప్రభుత్వంలో ఇండోసోల్ సోలార్ పరిశ్రమకు 5 వేల ఎకరాలకు పైగా ప్రభుత్వం భూములు కేటాయిస్తే ఈ సంస్థ యజమాని నర్రెడ్డి విశ్వేశ్వర్ రెడ్డి నాటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితులు కనుకనే వైసిపి ప్రభుత్వం అక్రమంగా ఇండోసోల్ పరిశ్రమకు పెద్ద ఎత్తున భూములు కేటాయిస్తుందని నాడు ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం నాయకులు తీవ్రమైన విమర్శలు గుప్పించారు. తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షం నుండి అధికార పక్షంలోకి మారిన తర్వాత తెలుగుదేశం పార్టీ వైఖరిలో కూడా మార్పు వచ్చింది. నాడు వద్దన్న ఇండోసోల్ సోలార్ పరిశ్రమ నేడు ముద్దు అయింది. కారణం తెలుగుదేశం పార్టీ నాయకులకు తెలుసు. నాడు వద్దన్న పరిశ్రమను నేడు అక్కడే నిర్మించాలని ప్రభుత్వం ఎందుకు పట్టుబడుతోంది. ఎన్నికల ముందు షిర్డీ సాయి కంపెనీ తెలుగుదేశం పార్టీకి ఎన్నికల బాండ్ల రూపంలో 40 కోట్ల రూపాయలు నిధి కింద ఇచ్చిన విషయం నేడు చర్చనీయాంశం అవుతున్నది. షిర్డీ సాయి కంపెనీ ఇచ్చిన 40 కోట్ల ఎన్నికల బాండ్ల నిధికి ప్రతిఫలంగా తెలుగుదేశం ప్రభుత్వం కరేడు గ్రామంలోని 8,458 ఎకరాల పచ్చని పంట పొలాలను ఇండో సోలార్ పరిశ్రమకు కట్టబెడుతోందా? కార్పొరేట్ కంపెనీల మోజులో తెలుగుదేశం ప్రభుత్వం రానున్న తరాలకు ఆహార భద్రతకు ప్రమాదాన్ని తీసుకొస్తున్నది.

కరేడు గ్రామ ప్రజలు వారి కష్టాన్ని నమ్ముకొని వ్యవసాయం సాగిస్తూ సంవత్సరానికి రెండు, మూడు పంటలు పండిస్తున్నారు. ఎంతో తియ్యటి ఉలవపాడు మామిడి పళ్ళను పండించి ప్రజలకిస్తున్నారు. ఇసుక నేలల్లో వేరుశనగ, వరి, చామ, కంద వంటి పంటలను పండిస్తూ లక్షలాది మంది ప్రజలకు ఆహారాన్ని అందిస్తున్నారు. తాపీ మేస్త్రీలుగా, భవన నిర్మాణ కార్మికులుగా, మామిడి, సపోటా కోత కూలీలుగా, కర్ర నరుకు కార్మికులుగా, మత్స్యకారులుగా, ఉప్పు పండించే రైతులుగా ఇలా అనేక విభిన్నమైన నైపుణ్యాలతో ప్రతి ఏటా రాష్ట్ర జిడిపికి 100 కోట్ల రూపాయలకు పైగా సంపదను జోడిస్తున్నారు. పచ్చని పంటలతో ఆహ్లాదకర వాతావరణం కరేడు సొంతం. కరేడు పల్లెల్లో ప్రతి ఊళ్లో వాలీబాల్ కోర్ట్ కనిపిస్తుంది. ప్రతి ఊళ్లో పోలీస్ శాఖలోనూ, ఉపాధ్యాయ వృత్తుల్లోను అనేక ఇతర ప్రభుత్వ శాఖల్లో తమ ప్రతిభతో ఉద్యోగాలు పొందిన యువత కనిపిస్తుంది. అంటే వ్యవసాయం, సముద్రపు వేట, చదువు, ఆటలు అన్నింటినీ పెనవేసుకున్న జీవితాలను ఛిద్రం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుందా అనిపిస్తుంది.

తమ పంట పొలాలను సోలార్ పరిశ్రమకు కేటాయించవద్దని తమ ప్రశాంత జీవితాన్ని తమ నుండి దూరం చేయవద్దని వేలాదిమంది ప్రజలు జూన్ 29వ తేదీన కలకత్తా-చెన్నై జాతీయ రహదారిని అనేక గంటలపాటు దిగ్బంధనం చేశారు. జులై 4వ తేదీన జరిగిన గ్రామసభలో నాలుగు వేల మందికి పైగా ప్రజలు పాల్గొని ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేయాలని, తమ భూములు ఇచ్చేది లేదని, సోలార్ పరిశ్రమ వద్దని ముక్త కంఠంతో సోలార్ పరిశ్రమ నిర్మాణాన్ని వ్యతిరేకించారు. అయినా ప్రభుత్వం అధికార పార్టీకి సంబంధించిన స్థానిక శాసనసభ్యుని, రెవెన్యూ యంత్రాంగాన్ని, సోలార్ కంపెనీ ప్రతినిధులను ప్రయోగించి ప్రజల్లో చీలిక తీసుకువచ్చి ఎలాగైనా భూసేకరణ చేపట్టాలని అడ్డదారుల్లో ప్రయత్నం చేస్తున్నది. బలహీనులుగా ఉన్న వారికి ఆర్థికంగా ఆశ చూపి లొంగ తీసుకునే ప్రయత్నం చేస్తున్నది. కరేడు భూ పరిరక్షణ ఉద్యమంలో చురుకుగా ఉన్న వారిపైన అక్రమ కేసులు బనాయించి జైలులో నిర్బంధించడం ద్వారా లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నది. ప్రభుత్వం చేస్తున్న అన్ని ప్రయత్నాలను ముక్తకంఠంతో తిప్పికొడుతూ అభేద్యమైన ఐక్యతతో ప్రజలు తమ భూములను కాపాడుకునేందుకు చైతన్యంతో ముందుకు వెళుతున్నారు. కార్పొరేట్ కంపెనీల మోజులో ఉన్న ప్రభుత్వానికి ప్రజల జీవనోపాధి, భవిష్యత్తు తరాల ఆహార భద్రత పట్టటం లేదు. ఎలాగైనా ప్రజల్లో చీలిక తీసుకువచ్చి, అధికారాన్ని ఉపయోగించి ప్రజలను లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నది. ప్రశాంతంగా ఉన్న కరేడు గ్రామంలో సెక్షన్ 30 అమలులో ఉందని గ్రామస్తులు నలుగురికి మించి కలవకూడదని, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని, బయటి వారెవరూ గ్రామంలోకి ప్రవేశించకూడదని ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నది.



2013 భూ సేకరణ చట్టం చాలా స్పష్టంగా 80 శాతం మంది రైతులు, ప్రజలు, గ్రామసభ ఆమోదంతోనే భూసేకరణ ప్రక్రియ చేపట్టాలని చెబుతున్నది. అయినా దానిని తుంగలో తొక్కి పదే పదే గ్రామ సభల పేరుతో తమకు అనుకూలంగా అభిప్రాయ సేకరణకు పూనుకుంటున్నది. జులై 4వ తేదీన జరిగిన గ్రామసభ స్పష్టమైన తీర్మానం చేసినా మళ్లీ గ్రామసభల పేరుతో ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తున్నది ప్రభుత్వం. రైతుల ప్రయోజనం కంటే కార్పొరేట్ కంపెనీల ప్రయోజనమే తమకు ముఖ్యమంటూ వేలాది ఎకరాల పచ్చని పంట పొలాలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే దుర్మార్గమైన ప్రయత్నాలను ఇప్పటికైనా విరమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రైతులు, ప్రజలు కోరుతున్నారు. అలా కాదని రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళితే కరేడు ప్రజలకు అండగా మేమున్నామంటూ రైతు సంఘాలు కదలనున్నాయి. ఈ నెల 18వ తేదీన 'చలో కరేడు' నినాదంతో బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా, వ్యవసాయ భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టొద్దని డిమాండ్ చేస్తూ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో రైతు సంఘాల రాష్ట్ర నాయకులు రైతులకు మద్దతుగా కరేడు వెళ్లనున్నారు. ఇప్పటికే అఖిల భారత న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో 20 మందికి పైగా హైకోర్టు న్యాయవాదులు కరేడు గ్రామ ప్రజలకు తమ సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించారు. సిపిఎం, సిపిఐ వంటి వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ పార్టీ ఇతర ప్రజాస్వామ్య పార్టీలు రాష్ట్ర ప్రభుత్వ అప్రజాస్వామిక, కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక భూసేకరణ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

> **మరొకసారి రాష్ట్ర ప్రభుత్వం సోలార్ పరిశ్రమ నిర్మాణం పేరుతో కరేడు గ్రామ ప్రజలను మోసగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు. కాదు, కూడదు అని ప్రభుత్వం ముందుకు వెళితే ఏ త్యాగానికైనా సిద్ధమవుతాం. మా భూములను కాపాడుకుంటాం. పచ్చని పంట పొలాలను కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలంటూ ప్రజలు ఐక్యంగా నినదిస్తున్నారు. ప్రభుత్వం పునరాలోచన చేయాలని, వ్యవసాయానికి పనికిరాని వేలాది ఎకరాల భూములు ప్రభుత్వానికి అందుబాటులో ఉండగా పచ్చని పంట పొలాలను నాశనం చేయొద్దని...ప్రజలు, ప్రజా సంఘాలు, రైతు సంఘాలు చేస్తున్న విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.**

రాష్ట్రంలో గత 20 సంవత్సరాలుగా ఉమ్మడి అనంతపురం, నెల్లూరు, ప్రకాశం, తూర్పు గోదావరి, విజయనగరం జిల్లాలలో ప్రభుత్వం సేకరించిన వేలాది ఎకరాలు పరిశ్రమలు పెట్టకుండా వృథాగా ఉంటున్నాయి. ప్రైవేట్ కంపెనీలు తమకు కేటాయించిన భూములను బ్యాంకుల్లో తనఖా పెట్టి వేల కోట్ల రూపాయల రుణాలు తీసుకొని పరిశ్రమలు పెట్టకుండా, నిధులు మళ్ళించి, ఇస్తామన్న ఉద్యోగాలు ఇవ్వకుండా రైతులను, ప్రజలను మోసం చేశాయి. మరొకసారి రాష్ట్ర ప్రభుత్వం సోలార్ పరిశ్రమ నిర్మాణం పేరుతో కరేడు గ్రామ ప్రజలను మోసగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు. కాదు, కూడదు అని ప్రభుత్వం ముందుకు వెళితే ఏ త్యాగానికైనా సిద్ధమవుతాం. మా భూములను కాపాడుకుంటాం. పచ్చని పంట పొలాలను కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలంటూ ప్రజలు ఐక్యంగా నినదిస్తున్నారు. ప్రభుత్వం పునరాలోచన చేయాలని, వ్యవసాయానికి పనికిరాని వేలాది ఎకరాల భూములు ప్రభుత్వానికి అందుబాటులో ఉండగా పచ్చని పంట పొలాలను నాశనం చేయొద్దని...ప్రజలు, ప్రజా సంఘాలు, రైతు సంఘాలు చేస్తున్న విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. మొండిగా ప్రభుత్వం ముందుకు వెళితే ప్రతిఘటన తప్పదు. కరేడు ప్రజలు విజయం సాధిస్తారు. పచ్చని పంట పొలాలను కార్పొరేట్ పరం కాకుండా కాపాడుకుంటారు.

/ వ్యాసకర్త ఎ.పి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి /

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps@ gmail.com

ఎర్రకోటపై 12వ సారి జెండా ఎగురవేసిన మోడీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎర్రకోటపై 12వ సారి త్రివర్ణ పతాకాన్ని ప్రధాని మోడీ ఎగురవేశారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 17 సార్లు ఎర్రకోటపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఇందిరాగాంధీ 16 సార్లు జాతీయ జెండా ఎగురవేశారు. ఎర్రకోట నుంచి అత్యధిక సమయం ప్రసంగించిన ప్రధానిగా మోడీ రికార్డు సృష్టించారు. 2014లో తొలిసారిగా ఎర్రకోట నుంచి ప్రసంగం చేసిన మోడీ అప్పుడు 65 నిమిషాలపాటు మాట్లాడారు. 2024లో 98 నిమిషాలపాటు మాట్లాడారు. 1947లో అప్పటి ప్రధాని నెహ్రూ 72 నిమిషాలపాటు ప్రసంగించారు. ఎర్రకోట నుంచి అతితక్కువ సమయం ప్రసంగం (14 నిమిషాలు) నెహ్రూ, ఇందిరా పేరిట ఉండటం గమనార్హం. దేశ 79వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎర్రకోటపై మోడీ జెండా ఎగురవేయడానికి ముందు త్రివిధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. రాజ్‌ఘాట్ వద్ద మహాత్మ గాంధీ సమాధికి ప్రణమిల్లారు. అమరుల స్మారం వద్ద నివాళులర్పించారు. నయా భారత్ ఇతివృత్తంతో నిర్వహించిన ఈ వేడుకల సందర్భంగా ఎర్రకోట పరిసర ప్రాంతమంతటా వాయుసేనకు చెందిన ఎంఐ 17 హెలికాప్టర్లు పూల వర్షం కురిపించాయి. ఈ వేడుకల్లో ప్రదర్శించిన 'ఆపరేషన్ సిందూర్' బ్యానర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

హుమయూన్ సమాధి సమీపంలో గోడ కూలి ఆరుగురి మృతి

న్యూఢిల్లీ : ఢిల్లీ నిజాముద్దీన్ ప్రాంతంలోని హుమయూన్ సమాధి ప్రాంగణానికి సమీపంలో ఉన్న ఒక దర్గాలోని కొంత భాగం శుక్రవారం కూలిపోయింది. ఈ ఘటనలో ఆరుగురు మరణించారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. దర్గా షరీఫ్ పట్టే షా దర్గా వద్ద శుక్రవారం ప్రార్థనల కోసం రెండు గదుల్లో జనం ఉండగా, ముందుగా ఒక గది వెనుక గోడ కూలిపోయిందని, తరువాత పైకప్పు కూలిపోయిందని జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సంజయ్ జైన్ తెలిపారు. గాయపడిన పది మందిని ఎయిమ్స్‌కు, లోక్ నాయక్ జై ప్రకాశ్ నారాయణ్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. వారిలో ఆరుగురు చికిత్స పొందుతూ మరణించినట్లు చెప్పారు. సంఘటనా ప్రాంతంలో పోలీసులు, అగ్నిమాపక దళం, ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కర్నాటకపై కేంద్రం వివక్ష : సిద్దరామయ్య

బెంగళూరు : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రతిపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వాలపై వివక్ష చూపుతోందని కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య విమర్శించారు. 79వ స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమంలో మువ్వన్నెల పతాకాన్ని ఎగురవేసిన అనంతరం ఆయన ప్రసంగించారు. నిధుల విడుదలలో కేంద్రం వివక్ష చూపుతుంటే, తమ ప్రభుత్వం సొంతంగా అభివృద్ధి నమూనాలను అనుసరిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారంటీ స్కీమ్‌లు ప్రపంచం దృష్టిని ఆకర్షించాయన్నారు. ఐక్యరాజ్యసమితి సాధారణ సభ అధ్యక్షుడు ఫిలేమన్ యాంగ్ ఇక్కడకు వచ్చి పథకాలను పరిశీలించారని తెలిపారు. ఆదాయ పన్ను విభాగం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) వంటి కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తూ వాటిని ప్రతిపక్ష నేతలపై మోడీ సర్కార్ ఉసిగొల్పుతోందని, ఇది ప్రజాస్వామ్య విలువలకు పాతర వేయడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం అనుసరిస్తున్న ఈ దుర్మార్గ వైఖరిని వ్యతిరేకిస్తూ ప్రజలందరూ గొంతుక వినిపించాలన్నారు. దేశంలో 80 శాతం సంపద కేవలం 10 శాతం వ్యక్తుల గుప్పిటే ఉందని చాలా సంస్థల సర్వేలు వెల్లడిస్తున్నాయని సిద్ధరామయ్య గుర్తు చేశారు. వారు సమష్టిగా జిఎస్‌టికి అందిస్తున్న మొత్తం 3 శాతం మాత్రమేనని విమర్శించారు. సాధారణ ప్రజలు 97 శాతం సమకూరుస్తున్నట్లు వెల్లడించారు.



ఎర్రకోటలో జాతీయ పతాకాన్ని ఎగురవేసే ముందు రాజ్‌ఘాట్ వద్ద మహాత్మాగాంధీ సమాధికి ప్రణమిల్లుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ



న్యూఢిల్లీలో ఎఐసిసి ప్రధాన కార్యాలయం వద్ద వేడుకల్లో ప్రసంగిస్తున్న ఖర్గే

ఆర్‌ఎస్‌ఎస్‌పై ప్రశంసలు సిగ్గుచేటు

- మన అమరవీరుల జ్ఞాపకాలను అగౌరవపరచడమే
- ప్రధాని మోడీ ప్రసంగంపై సిపిఎం విమర్శ

న్యూఢిల్లీ : స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ఎర్రకోటపై నుండి జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ఆర్‌ఎస్‌ఎస్‌ను పొగడ్తల్లో ముంచెత్తడం తీవ్ర విచారకరమని సిపిఎం శుక్రవారం పేర్కొంది. కపటపూరితమైన చారిత్రక రికార్డు కలిగిన సంస్థ అదని వ్యాఖ్యానించింది. 79వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలకు సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన పోస్టు పెట్టారు. మహాత్మా గాంధీ హత్యానంతరం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్)ను నిషేధించారని, మతోన్మాద అల్లర్లు రెచ్చగొట్టడంలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్రను చరిత్రకారులు డాక్యుమెంట్‌గా నమోదు చేశారని బేబీ ఆ పోస్టులో పేర్కొన్నారు. వలస పాలన నుండి స్వేచ్ఛాస్వాతంత్య్రాల వరకు భారతదేశ ప్రయాణం చాలా సుదీర్ఘమైనది, కఠినమైనది.

షహీద్ భగత్ సింగ్,అషఫకుల్లా ఖాన్ వంటి అమరవీరులు మన జ్ఞాపకాల్లో ఎప్పటికీ నిలిచి వుంటారని బేబీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. 'మహాత్మాగాంధీ నుండి సుభాష్‌చంద్రబోస్, మౌలానా అబుల్ కలామ్ అజాద్ నుండి కామ్రేడ్ పి.కృష్ణపిళ్ళై, ఇఎంఎస్, ఎకెజి, అక్కమ్మ చెరియన్ వరకు ఇలా లెక్కలేనంతమంది సాగించిన నిస్వార్థ పోరాటాలు మన స్వాతంత్య్రానికి చక్కని పునాదిని వేశాయని ఆయన అన్నారు. కానీ ప్రధాని తన ప్రసంగంలో కపటపూరితమైన చారిత్రక రికార్డును కలిగిన ఆర్‌ఎస్‌ఎస్‌ను ప్రశంసించడం ద్వారా మన అమరవీరుల జ్ఞాపకాలను, మన స్వాతంత్య్ర ఉద్యమ స్ఫూర్తిని అగౌరవపరిచారని విమర్శించారు. ఇది ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కానిదన్నారు. పైగా సిగ్గుచేటైన అంశమని అన్నారు. దేశ స్వాతంత్య్ర పోరాటాల్లో ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎలాంటి పాత్ర లేదని, పైగా మతపరమైన కారణాలతో దేశ ఐక్యతను దెబ్బతీయడానికి నిరంతరంగా ప్రయత్నించిందని బేబీ విమర్శించారు.



న్యూఢిల్లీలోని కరోల్‌భాగ్‌లో పాఠశాల విద్యార్థులతో కలిసి మువ్వన్నెల పతాకాన్ని ఎగురవేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ

బిజెపి ఎంతకైనా దిగజారుతుంది...: ఖర్గే

కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన పతాకావిష్కరణ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. అధికారంలో కొనసాగేందుకు ఏ స్థాయి అనైతికతకైనా దిగజారేందుకు బిజెపి సిద్ధంగా వుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జై రాం రమేష్ మాట్లాడుతూ, తన పదవీకాలం కొనసాగాలంటే ఆర్‌ఎస్‌ఎస్‌ను మంచి చేసుకోవడం తప్ప మోడీకి మరో గత్యంతరం లేదని విమర్శించారు. ఎర్రకోటపై నుండి ప్రసంగిస్తూ ఆర్‌ఎస్‌ఎస్ గురించి మాట్లాడటమంటే రాజ్యాంగ స్ఫూర్తిని, సెక్యులర్ రిపబ్లిక్ స్ఫూర్తిని దారుణంగా ఉల్లంఘించడమేనని విమర్శించారు.ఎంపి ప్రియాంక గాంధీ స్పందిస్తూ రాజ్యాంగంతో పాటూ అమరవీరులు చేసిన త్యాగాలను కూడా పరిరక్షించుకోవడం అవసరమని అభిప్రాయపడ్డారు.

రాష్ట్రాల అధికారాలను లాక్కునే యత్నం

- కేంద్రంపై తమిళనాడు సిఎం స్టాలిన్ విమర్శ

చెన్నై : రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్న అధికారాలను లాక్కోవడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ విమర్శించారు. స్వాతంత్య్రదినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నిధుల పంపిణీ లేదా బదిలీలో వివక్షత కారణంగా రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంపై ఆధారపడాల్సిన వస్తోందన్నారు. అలాగే కేంద్ర చట్టాలు, కోర్టు తీర్పుల ద్వారా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాల్సి వస్తోందన్నారు. విద్య, ఆరోగ్య సంరక్షణస్త్ర వంటి కీలక రంగాల్లో రాష్ట్రాల అధికారాలను లాగేసుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు చాలా సన్నిహితంగా వుంటాయని, అటువంటపుడు వారికి మరిన్ని అధికారాలు వుండాలని స్టాలిన్ స్పష్టం చేశారు. రాష్ట్రాలకు రావాల్సిన నిధుల్లో వాటాలు, అధికారాలను పునరుద్ధరించడానికి రాజ్యాంగపరమైన చర్యలొక్కటే ఏకైక మార్గమని ఆయన పేర్కొన్నారు. రాజకీయ,చట్టపరమైన పోరాటాల ద్వారా మాత్రమే మనం మన హక్కులను, అధికారాలను, నిధుల్లో వాటాలను పరిరక్షించుకోగలమని, అటువంటి పోరాటాలకు సమయం ఆసన్నమైందని అన్నారు. నిజమైన ఫెడరల్ భారతదేశమే బలమైన, అభివృద్ధి చెందిన భారతదేశంగా ప్రకాశించగలదని స్టాలిన్ పేర్కొన్నారు.

నాగాలాండ్ గవర్నర్ గణేశన్ మృతి

చెన్నయ్ : నాగాలాండ్ రాష్ట్ర గవర్నర్ లా గణేశన్ (80) చెన్నయ్‌లోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో శుక్రవారం రాత్రి కన్నుమూశారు. ఈ నెల 8న చెన్నయ్‌లోని తన నివాసంలో కుప్పకూలిన గణేశన్‌కు తలలో తీవ్ర గాయమవ్వడంతో ఆసుపత్రిలో చేర్పించారు. గణేశన్ మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తదితర ప్రముఖుల సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

జమ్ముకాశ్మీర్‌లో శిథిలాల కింద 500 మంది

- 60కి చేరిన మృతుల సంఖ్య

జమ్ము : జమ్మూకాశ్మీర్‌లోని కిష్త్వార్‌లో గురువారం సంభవించిన భారీ వర్షాల కారణంగా నేలమట్ట మైన వివిధ భవనాలు, నిర్మాణాల శిథిలాల కింద 500 మంది పైగానే చిక్కుకున్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూఖ్ అబ్దుల్లా శుక్రవారం ఈ విషయం చెప్పారు. అయితే కొన్ని వార్తా సంస్థలు వెయ్యి మంది పైగానే గల్లంతయ్యారని పేర్కొ న్నాయి. కిష్త్వార్‌లోని ఛసోతి ప్రాంతంలో చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటనలో ఇప్పటి వరకు 60 మంది చనిపోయినట్లు పోలీసులు ధ్రువీ కరించారు. మరో 100 మంది పైగా గాయపడ్డార ని, శుక్రవారం మరో 80 మందిని రక్షించామని తెలిపారు.

తరిగామి పరామర్శ

పెను విపత్తులో ఆప్తులను కోల్పోయిన కిష్త్వార్‌లోని వరద బాధిత కుటుంబాలను సిపిఎం నాయకులు, కుల్గాం ఎమ్మెల్యే మహ్మద్ యూసుఫ్ తరిగామి శుక్రవారం నాడు పరామర్శించారు. బాధితుల్ని తక్షణమే, సమన్వయంతో ఆదు కోవాలని ఆయన కోరారు.

మానవ నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ఘటనలు సంభవిస్తున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యంత విషాదకరమైన ఈ సమయంలో ప్రభుత్వం ఎటువంటి జాప్యం చేయ కుండా బాధితులకు అండగా నిలిచి అన్ని విధాలుగా ఆదుకోవాల న్నారు. జమ్మూకాశ్మీర్ ప్రాంతం పర్యావరణ పరంగా సున్నితమైన ప్రాంతం కావడం వలన వాతావరణ మార్పులకు త్వరగా ప్రభావానికి గురవుతుందని అన్నారు. గ్లోబల్ వార్మింగ్, నిర్లక్ష పూరితమైన పట్టణాభివృద్ధి నుంచి అటవీ నిర్మూలన, మన నీటి వనరులపై అశ్రద్ధ.. వంటి కారణంగానే ఇలాంటి విపత్తులు ముంచెత్తుతు న్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఇలాంటి విపత్తులు జరగకుండా చర్యలు చేపట్టాలని, పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.



తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి అభివాదం చేస్తున్న కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్

మత శక్తులతో అప్రమత్తంగా ఉండాలి

- కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్

తిరువనంతపురం : దేశాన్ని విభజిస్తున్న మత శక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ హెచ్చరించారు. రాజ్యాంగ విలువలను గౌరవించాలని, దేశ ఐక్యతకు ఎదురవుతున్న అంతర్గత, బహిర్గత ముప్పును ఎదుర్కోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. జాతీయోద్యమంలో ఏకతాటిపై నిలిచేందుకు ప్రజలు సామాజిక, మత విభేదాలను అధిగమించారని, దాని ఫలితమే 78 సంవత్సరాల భారత స్వాతంత్య్రమని చెప్పారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆయన శుక్రవారం సందేశమిస్తూ ప్రాంతీయ, భాషా, మత వైవిధ్యాలకు భారతదేశం ఒక నిధి వంటిదని అభివర్ణించారు. అయితే లౌకికవాదం, స్నేహం, సహజీవనం ఆధారంగా నిర్మితమైన జాతీయతను వక్రీకరించడానికి, ప్రజలను విభజించడానికి ప్రతీఘాత శక్తులు ప్రయత్నిస్తున్నాయని హెచ్చరించారు.

ప్రభుత్వ విధానాలలో తప్పులను ఎత్తిచూపుతూ చేస్తున్న విమర్శలను ఈ శక్తులు దేశద్రోహంగా ముద్ర వేస్తున్నాయని, జాతీయోద్యమ సంప్రదాయాలను మసకబారుస్తున్నాయని, మత సమీకరణ ద్వారా ముఖ్యమైన సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాయని పినరయి విమర్శించారు. ప్రజాస్వామ్య సంస్కృతి ఎక్కువగా ఉన్న దేశానికి ఇలాంటి ధోరణులు తగినవా కావా అనే విషయాన్ని ఆత్మపరిశీలన చేసుకోవాలని కోరారు. భారత స్వాతంత్య్ర పోరాటాన్ని పినరయి గుర్తు చేస్తూ దేశ ప్రజాస్వామ్య సంస్కృతి మూలాలు మానవత్వం, పరస్పర ప్రేమలో ఉన్నాయని, జీవన పరిస్థితులను మెరుగుపరచడం దేశ నిర్మాతలు అప్పగించిన విధి అని చెప్పారు. గత పాఠాలను ఉపయోగించుకుంటూ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని, అందరూ సమానంగా జీవించే భారతదేశాన్ని ఊహించుకోవాలని సూచించారు.

తొలిసారిగా చైనాలో హ్యూమనాయిడ్ రోబో వరల్డ్ గేమ్స్

(మొదటి పేజీ తరువాయి)

కుంగ్ ఫూ, డాన్స్, ఔషధాలు వేరు చేయడం.. వంటి అంశాల్లో పోటీపడ్డాయి. ఒకదాన్ని మరొకటి ఢీకొని కొన్ని రోబోలు కిందపడిపోయినా, పోటీలు ఆసక్తికరంగా సాగాయి. మూడురోజులపాటు జరిగే ఈ పోటీల్లో 16దేశాల నుంచి 280 జట్లు పాల్గొంటున్నాయి. 26 ఈవెంట్లలో 500కంటే ఎక్కువ పతకాల కోసం పోటీపడ్డాయి. 1500 మీటర్ల రన్నింగ్ రేసును ఒక రోబో 6 నిమిషాల 29:37 సెకన్లలో పూర్తి చేసింది. ఇది మానవ రికార్డుకు (3 నిమిషాల 26 సెకన్లు) చాలా దూరంలో ఉన్నా, రోబో ఇలా పరుగు పందెం పూర్తి చేయడం ఆకట్టుకుంది. ఫుట్‌బాల్ విభాగంలో చైనా జట్లు నైపుణ్యం చూసి ఆశ్చర్యపోయానని, వారు చాలా వేగంగా ప్రపంచ నాయకత్వ స్థాయికి చేరుకుంటారని డచ్ నుంచి జూస్ట్ వీర్‌హీమ్ తెలిపారు. 2022 వింటర్ ఒలింపిక్స్ కోసం నిర్మించిన నేషనల్ స్పీడ్ స్కేటింగ్ ఓవల్‌లో ఈ పోటీలు జరుగుతున్నాయి. 22 డాలర్ల నుంచి 80 డాలర్ల వరకూ టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయి. కృత్రిమ మేధస్సుతో నడిచే రోబోలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి చైనా తన ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్న నేపథ్యంలో ఈ గేమ్స్ ప్రారంభమయ్యాయి. రోబోటిక్స్, ఎఐ వంటి సాంకేతిక స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడానికి చైనా ఈ ఏడాది మార్చిలో ఒక ట్రిలియన్ యువాన్ల (సుమారు 119 బిలియన్ డాలర్లు) ప్రణాళికలను ప్రకటించింది.

ఆర్‌ఎస్‌ఎస్ భజన

(మొదటి పేజీ తరువాయి)

బహిరంగ ప్రదేశాలన్నింటినీ భద్రతా కవచం నీడన చేరుస్తాం. శ్రీకృష్ణ భగవానుని సుదర్శన చక్రం దారిని మేము ఎంచుకున్నాం' అని అన్నారు.

దీపావళి నుంచి జిఎస్‌టి 2.0

రాబోయే దీపావళి రోజు ప్రభుత్వం తదుపరి తరం వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) సంస్కరణలను ప్రారంభిస్తుందని, వీటి వల్ల సామాన్య ప్రజలు, ఎంఎస్ఎంఈలు, దేశీయ తయారీ రంగంపై పన్ను ఒత్తిడులు తగ్గుతాయని అన్నారు. 'అది మీకు దీపావళి బహుమతి. కొత్త జిఎస్‌టి సంస్కరణలు భారతీయులు ప్రతి రోజూ వినియోగించే వస్తువులపై పన్నుల్ని తగ్గిస్తాయి' అని చెప్పారు. ఈ కార్యక్రమానికి హాజరైన మహిళలను ఉద్దేశించి మోడీ మాట్లాడుతూ తన హయాంలో రెండు కోట్ల మంది 'లఖ్‌పతి దీదీలు' అయ్యారని చెప్పుకొచ్చారు.

రైతులకు, పాడి రైతులకు రక్షణ గోడగా..

ట్రంప్ విధించిన భారీ సుంకాలు భారత్ మెడపై కత్తిలా వేలాడుతున్న సమయంలో మోడీ 'ఆత్మనిర్భరత' 'దేశీయ ఉత్పత్తుల వినియోగం' వంటి ప్రభుత్వ పదబంధాలను మరోసారి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమానికి మద్దతు ఇవ్వాల్సిందిగా అన్ని రాజకీయ పక్షాలనూ కోరారు. రైతులు, పశు పోషకులు, మత్స్యకారులకు మేము అత్యంత ప్రాధాన్యత ఇస్తాం. వారి ప్రయోజనాలను దెబ్బతీసే ఏ విధానమైనా దానికి వ్యతిరేకంగా మోడీ ఓ గోడలా నిలబడతాడు. రైతుల ప్రయోజనాలు కాపాడే విషయంలో భారత్ ఎన్నటికీ రాజీ పడబోదు' అని స్పష్టం చేశారు. అయితే ఆయన తన ప్రసంగంలో ఎక్కడా ట్రంప్ విధించిన యాభై శాతం సుంకాలను ప్రస్తావించలేదు. సౌర, హైడ్రోజన్, అణు రంగాల్లో చేపట్టిన అనేక చర్యల ద్వారా ఇంధన ఉత్పత్తిని పెంచే దిశగా భారత్ ముందుకు సాగుతోందని అంటూ స్వావలంబన సాధించాల్సిన అవసరాన్ని మోడీ నొక్కి చెప్పారు. అంతరిక్షం, కీలకమైన ఖనిజ రంగాల్లో కూడా భారత్ పురోభివృద్ధి సాధిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వాలను విమర్శించబోనని చెబుతూనే వాటిపై మోడీ ఆరోపణలు సంధించారు.

ముస్లింలపై అక్కసు.. యువతకు గొప్పలు

ఒక పక్క దేశంలోని మెట్రోపాలిటన్ నగరాలలో బెంగాలీ భాష మాట్లాడే నిరుపేద ముస్లింలు పోలీసుల అమానుష అణచివేతలకు గురవుతుంటే ప్రధాని మాత్రం వారిపై విషం చిమ్మే ప్రయత్నం చేశారు. ఎలాంటి పత్రాలు లేకుండా దేశంలో ప్రవేశించే వలసదారులు భారత జనాభా కూర్పును మార్చేందుకు దూరాలోచనతో కుట్ర పన్నుతున్నారని ఆరోపిస్తూ దానిని అదుపు చేసేందుకు విశేషాధికారాలు కలిగిన 'జనాభా మిషన్'ను ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. చొరబాట్ల ద్వారా జనాభా కూర్పుకు ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు ప్రభుత్వం ఈ మిషన్‌ను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ప్రతియేటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామంటూ గతంలో ఇచ్చిన హామీలను నీటి మీద రాతలుగా మార్చిన మోడీ..ఈ దఫా కూడా అది చేస్తాం..ఇది చేస్తామంటూ గొప్పలు ప్రకటించారు. ఈ రోజు నుంచే ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజనను ప్రారంభిస్తున్నామని అంటూ ప్రైవేటు రంగంలో మొదటిసారి ఉద్యోగం కోరుకునే వారికి రూ.15 వేలు చొప్పున అందజేస్తామని తెలిపారు.

నాలెడ్జ్ ఎకానమీదే భవిష్యత్

(మొదటి పేజీ తరువాయి)

తల్లుల ఖాతాల్లో రూ.10 వేల కోట్లు జమ చేశామన్నారు. అన్నదాతా..సుఖీభవ పథంలో మొదటి విడతలో భాగంగా 47 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.3,173 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామన్నారు. మెగా డిఎస్‌సిలో భాగంగా 16,347 పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహించామని, ఈ నెలాఖరులోగా నియామకాలు పూర్తిచేస్తామని వెల్లడించారు. వడ్డెల కులస్తులకు మైనింగ్‌లో లీజుల్లో 10 శాతం కేటాయిస్తామన్నారు. బిసిల రక్షణ చట్టం తీసుకువచ్చేందుకు మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేస్తోందని తెలిపారు. 40 వేల సెలూన్‌లకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా కల్లుగీత కార్మికులకు 10 శాతం మద్యం దుకాణాలు కేటాయించామన్నారు. 'మత్స్యకారుల సేవలో' భాగంగా 1.29 లక్షల కుటుంబాలకు రూ.259 కోట్లు అందించినట్లు వెల్లడించారు. చేనేతకు అండగా ఉంటూ హ్యాండ్లూమ్స్‌కు నెలకు 200, పవర్ లూమ్స్‌కు నెలకు 500 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఎస్‌సి సామాజిక వర్గాల్లో అంతరాలు తగ్గించేలా, ఏ వర్గాన్ని నొప్పించకుండా, ఏ ఒక్కరూ నష్టపోకుండా వర్గీకరణతో వారి దశాబ్దాల ఆకాంక్ష నెరవేర్చామన్నారు. అడవితల్లి బాటలో భాగంగా రూ.వెయి కోట్లతో మారుమూల గిరిజన ప్రాంతాలకు ప్రధాన రహదారులను అనుసంధానం చేసినట్లు చెప్పారు. ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజన్లకు రూ.5 వేలు గౌరవ వేతనం ఇస్తున్నామని చెప్పారు. భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో సోషల్ మీడియాలో మహిళలపై అసభ్యకర పోస్టులు పెడితే కఠినంగా వ్యవహరిస్తూ, వారి ఆత్మగౌరవాన్ని కాపాడుతున్నామన్నారు. 2027 డిసెంబరు నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని, కేంద్ర ప్రభుత్వం రూ.12,157 కోట్ల నిధులు విడుదల చేసి, సకాలంలో పనులు జరిగేందుకు సహకరించిందన్నారు. వెలుగొండ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యతిస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది జులై నాటికి సాగు నీరు ఇచ్చేలా పనులు వేగవంతం చేశామని తెలిపారు. రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు గోదావరి వృధా జలాలను పోలవరం నుంచి బనకచర్లకు మళ్లించాలని నిర్ణయించామని, సముద్రంలోకి వృథాగాపోయే నీటిని వినియోగించుకుంటామని తెలిపారు. వరద నష్టాలను భరిస్తున్నామని, ఆ నీటిని వాడుకుంటే అభ్యంతరాలేందుకని ప్రశ్నించారు. 2028 నాటికి జలజీవన్ మిషన్ కింద ప్రతి పల్లెకు ప్రతి గడపకు సురక్షిత తాగునీరు అందిస్తామని తెలిపారు. ఇప్పటి వరకూ 9 ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశాలు నిర్వహించి 113 ప్రాజెక్టులకు సంబంధించి రూ.5.94 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపామని, వీటితో 5.56 లక్షల ఉద్యోగాలు వస్తాయన్నారు. ఉచిత ఇసుకను అందిస్తున్నామని, 2029 నాటికి అందరికీ ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్ట్, హార్బర్, కొత్తగా 6 ఎయిర్ పోర్టులు నిర్మిస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. యోగాంధ్రలో భాగంగా యోగాధ్యయన పరిషత్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పి-4 కార్యక్రమంలో 10.34 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించామని, వీరికి 1.15 లక్షల మంది మార్గదర్శులు సాయం చేసేందుకు ముందుకువచ్చారన్నారు. ఈ నెల 19వ తేదీ నుంచి ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డిజిపి హరీష్ కుమార్ గుప్తా, సిఎం సతీమణి నారా భువనేశ్వరి, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జీవన సారథం


లక్ష్య సాధనలో అంతరాయాలు కలిగే కొద్దీ సంకల్పాన్ని దృఢతరం చేసుకుంటూ ముందుకు పోవాలి.

మీ కోసం

వంట నూనెను నిల్వ ఉంచే డబ్బాలో గానీ, బాటిల్‌లో గానీ నాలుగు లేదా ఐదు లవంగాలను వేసి ఉంచితే నూనె వాసన రాకుండా ఉంటుంది.



ఇల్లంటే ఇదే..



ఒకరోజు తాబేలు, ఒక పక్షి మాట్లాడుకుంటూ ఉన్నాయి. తాబేలు పక్షిని 'ఎక్కడ ఉంటావు' అని అడిగింది. ఆ పక్కనే కొమ్మ అంచున ఉన్న తన గూడును చూపించింది పక్షి. 'కర్ర పుల్లలతో చేసి ఉంది కదా అదేనా నీ ఇల్లు' అంది తాబేలు. 'అవును అదే! నేనే కష్టపడి కట్టుకున్నాను' అంది పక్షి సంతోషంగా. 'దానికన్నా నా డొప్ప చూడడానికి బాగుంది' అంది తాబేలు. తాబేలు మాటలకు పక్షి ఏమీ మాట్లాడలేదు. 'ఎండ వచ్చినా, వాన వచ్చినా నీ గూటిని తాకుతాయి అనుకుంటా! అందులో ఎలా ఉంటావో! ఏమో! నేనైతే ఎండ వచ్చినా, వాన వచ్చినా ఇంకే ప్రమాదం వచ్చినా ఎంచక్కా నా డొప్ప లోపలికి వెళ్ళిపోతాను. నాకు అసలు ఏ ఇబ్బందీ ఉండదు' అంది తాబేలు గొప్పలు పోతూ.

తాబేలు మాటలకు పక్షి గట్టిగా సమాధానం చెప్పాలనుకుంది. 'ఇది నేను సొంతంగా నిర్మించుకున్న గూడు అందుకే అది ఎలా ఉన్నా నాకు ఇష్టమే. నీ డొప్ప లోపల నువ్వు ఒక్కదానివే ఉండగలవు, కానీ నా ఇంట్లో నేను, నా భార్య పిల్లలు అందరం కలిసి ఉండగలం. అందుకే నాకు మా ఇల్లే ఇష్టం' అంటూ అక్కడ నుంచి ఎగిరిపోయింది.

పక్షి చెప్పిన మాటల్లోని వాస్తవాన్ని గుర్తించిన తాబేలు తన తప్పు తెలుసుకుంది. అప్పటి నుంచి ఎదుటివారిని తక్కువ చేసి మాట్లాడడం గొప్పలు పోవడం లాంటివి చేయలేదు.




ఎస్. విజ్ఞాన్ చరిత్,
5వ తరగతి,
అరవింద హైస్కూలు,
కుంచనపల్లి,
గుంటూరు జిల్లా.

తేడాలు గుర్తించండి



పిల్లలూ, ఇక్కడ ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో ఐదు తేడాలు ఉన్నాయి. కనిపెట్టండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ






ఎస్.సఫియా బతూల్,
5వ తరగతి,
సెయింట్ జోసెఫ్స్ ఇంగ్లీషు మీడియం స్కూలు,
ఎన్ ఆర్ పేట, కర్నూలు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

శాస్త్ర, సాంకేతిక, భాషలు, కళలను పరిరక్షిస్తాం

'మారుతున్న సమాజానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక రంగాలతోపాటుగా భాషలు, కళల పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. ప్రపంచవ్యాప్తంగా చూస్తే ఏ రంగంలోనైనా పురోగతి ఉంటోంది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఇది మరింత వేగంగా కనిపిస్తుంద'ని మందలపు రవి తెలిపారు. అంతరించే భాషల్లో ఒకటైన మాతృభాషను మృతభాష కాకుండా పరిరక్షిస్తామని రాయపాటి విల్సన్ (శరత్‌చంద్ర) అంటున్నారు. భారతీయ వారసత్వంగా వచ్చిన కళలు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల పరిరక్షణే ధ్యేయమని వుంపూరు మంగులయ్య వెల్లడించారు. రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్‌గా రాయపాటి విల్సన్ (శరత్‌చంద్ర, కావలి నెల్లూరు జిల్లా), రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ చైర్మన్‌గా మందలపు రవి, పామర్రు-కృష్ణా జిల్లా), రాష్ట్ర జానపదం, సృజనాత్మక అకాడమీ చైర్మన్ వుంపూరు మంగులయ్య (పాడేరు, అల్లూరి సీతారామరాజు జిల్లా) నియమితులైన సందర్భంగా 'జీవన' కోసం వారితో సంభాషించాం. ఆయా రంగాలకు వారు ఏం చేయబోతున్నారో అడిగి తెలుసుకున్నాం. ఆ వివరాలు ఇవిగో....







శాస్త్ర, సాంకేతిక రంగాలతోనే అభివృద్ధి



రాబోయే కాలంలో ప్రపంచంలో శాస్త్ర, సాంకేతిక రంగాల ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుంది. కృత్రిమ మేధ, వేరబుల్, వర్చువల్ రియాల్టీ, త్రీడీ, రోబో, మెటావర్ తదితర సాంకేతికతల్లో పైచేయి సాధించాలి. కాలుష్య కారక ఇంధనాలకు స్వస్తి పలికి.. పునరుత్పాదక, హరిత ఇంధనాలపై దృష్టి సారించాలి. స్వయం చోదక వాహనాలకు మార్గం సుగమం చేసుకోవాలి. తక్కువ ఖర్చుతో నాణ్యమైన నిర్మాణ సాంకేతికతలను అభివృద్ధి చేసుకోవాలి. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి) సాయంతో ఇళ్లు, కార్యాలయాలు, కార్లు, నగరాల్లోని డిజిటల్ సాధనాలతో అనుసంధానం పెంచుకోవాల్సివుంది. వాతావరణ మార్పులను అధిగమించే పరిజ్ఞానాలు, పర్యావరణ హిత విధానాలను ఆచరణలో పెట్టాలి. అంతరిక్ష పరిశోధనలు పెంచుకోవాల్సివుంది. రోగ నిర్ధారణ, చికిత్సల్లో రోబోటిక్-నానో సాంకేతికత వినియోగాన్ని పెంచాలి. క్వాంటం కంప్యూటింగ్ చాలా వేగం, ఖచ్చితత్వంతో కూడిన ప్రక్రియ. సమీప భవిష్యత్తులో ఊహించలేనంత వేగంగా జనజీవితంలోకి ఈ టెక్నాలజీ వచ్చేస్తుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ అడుగుజాడల్లో రాష్ట్రంలో సైన్స్, టెక్నాలజీ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషిచేస్తాను.

మందలపు రవి, సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ చైర్మన్

కళలకు పూర్వవైభవం తీసుకొస్తా



తెలుగు కళలు, సాహిత్యం, కథలు, కవిత్వం, సినిమాటోగ్రఫీ తదితర వంటి వాటి ద్వారా సంస్కృతి పరిరక్షణకు కృషిచేస్తాం. కళా ప్రదర్శనల ఏర్పాటుతోపాటుగా ఔత్సాహిక కళాకారులకు ప్రోత్సాహకాలు ఉండేలా కృషిచేస్తాం. దళితులు, గిరిజనుల్లోని ప్రత్యేకమైన కళలను వెలుగులోకి తెస్తాం. అంతరించిపోతున్న కళారీతులను పరిరక్షించి, ఆధునీకరించే కృషి చేపడతాం. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తెలుగు భాషతోపాటుగా కళలు, సాంస్కృతిక వికాసానికి పెద్దపీట వేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల ఆశీస్సులతో రాష్ట్రంలో జానపద కళలు, సాంస్కృతిక రంగానికి పూర్వవైభవం తీసుకొచ్చేలా కృషి చేస్తా. రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌తో ఇప్పటికే కళారంగ పరిరక్షణ కోసం, అభివృద్ధి కోసం కలిసి మాట్లాడాను. జానపద కళలు, తెలుగు సంస్కృతి పరిరక్షణకు అవసరమైన నిధులు కేటాయింపునకు ఆయన అంగీకరించారు. ఎన్టీఆర్ ఆకాంక్షించిన జానపద కళారూపాల పరిరక్షణకు కృషిచేయటం ద్వారా పూర్వవైభవం వచ్చేలా కృషిచేస్తా. విశాఖ స్టీల్‌ప్లాంట్ పోరాటంలో నేను కూడా పవన్ కళ్యాణ్‌తో పనిచేశా. గతంలో గద్దర్, వరవరరావు, వంగపండు వంటి నేతలతో కలిసి పనిచేసిన అనుభవం ఉంది. గిరిజనులు, ఆదివాసీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పనిచేసిన ఉద్యమ నేతగా గుర్తింపు పొందా. అందుకే పవన్ కళ్యాణ్ నాకు ఈ బాధ్యత అప్పగించారు.

వుంపూరు మంగులయ్య, జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్

భాషా సాహిత్యాల వికాసానికి ప్రణాళికలు



ఇప్పటి వరకూ తెలుగు, సంస్కృత అకాడమీ కేవలం పుస్తకాల ముద్రణకే పరిమితమైంది. ఇక నుంచి పుస్తకాల ప్రచురణలను మరింత విస్తృత పర్చటం ద్వారా ఇంగ్లీషు మింగేస్తున్న భాషలను బతికించటానికి కృషిచేస్తా. ప్రాంతీయ, దేశ, అంతర్జాతీయ భాషలపై అవగాహన మంచిదే. అవసరం కూడా. ఆ పేరుతో ప్రాంతీయ భాషలను పూర్తిగా వదిలేస్తే జన జీవన నాడిపై తీవ్ర ప్రభావం పడుతుంది. వాడుక భాషను వదిలేస్తే భావి తరాలు తీవ్రంగా నష్టపోతాయి. వారి జీవనం, మనసు, మెదడుపై కూడా ఆ ప్రభావం కన్పిస్తుంది. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ యూనివర్శిటీ స్థాయి వరకూ మాతృభాషలో బోధన ఉంటే మంచిదని ప్రబోధించారు. కానీ ఇప్పుడు ప్రాథమిక దశలోనే తెలుగు లేకుండాపోతే ఎలా?.కనీసం ఆరో తరగతి వరకైనా మాతృభాషలో బోధన ఉండాలని శక్తివంచన లేకుండా కృషిచేస్తాం. తెలుగు, సంస్కృత భాషల్లో మరింత విస్తృతంగా సాహిత్యం వచ్చేలా ప్రోత్సహిస్తాం. నిష్ణాతులైన పెద్దలు, నిపుణులు, భాషా వేత్తల అభిప్రాయాలు తీసుకుంటాం. మా అకాడమీ ద్వారా రాష్ట్రంలోని 50 మంది జన రంజక కవుల పేర్లను ఎంపికచేసి వారి జీవిత గాథలను అకాడమీ ద్వారా ప్రచురిస్తాం.భావితరాలకు వారి సందేశాలు. సాహిత్యం ఎంతో అవసరం. వారి త్యాగాలు అనన్య సామాన్యం. అందుకే అలాంటి మహనీయుల జీవితాలు భావితరాలకు తెలియజేస్తే సాహిత్యం రానున్నకాలంలో మరింత సుసంపన్నం అవుతుందనేది నా భావన. తెలుగు భాష, సాహిత్యం, మాండలికాలు, పద్య, గద్య అంశాలు మరింత విస్తృతంగా సాహిత్య రూపంలో అకాడమీ ప్రచురణల ద్వారా వెలుగులోకి రావటానికి కృషిచేస్తాం. ఎపిపిఎస్‌సి ద్వారా నిర్వహించే గ్రూప్ -1 నుంచి గ్రూప్-4 పరీక్షలకు అవసరమైన నాణ్యమైన, మంచి కంటెంట్‌తో పుస్తకాలను ప్రచురిస్తాం. ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ పరీక్షల పుస్తకాలే కాకుండా పోటీ పరీక్షల బుక్స్ రూపకల్పన, ప్రింటింగ్‌కు ప్రాధాన్యత ఇస్తాం. ఏటేటా ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం రోజున తెలుగు, సంస్కృత భాషల విస్తృతికి కృషిచేసే వారిని గుర్తించి పురస్కారాలు ప్రదానం చేస్తాం.

రాయపాటి విల్సన్ (శరత్‌చంద్ర)
తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్

సంభాషణ : యడవల్లి శ్రీనివాసరావు.

పుతిన్ - ట్రంప్ భేటీ షురూ

- యుద్ధం ఆపకపోతే వాకౌట్ చేస్తా : ట్రంప్



అలస్కాలో యాంకరేజ్ విమానాశ్రయం వద్ద రష్యా అధ్యక్షులు పుతిన్‌ను చర్చలకు ఆహ్వానిస్తున్న ట్రంప్

అలాస్కా : ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తున్న రష్యా, అమెరికా అధ్యక్షులు పుతిన్ - ట్రంప్ మధ్య భేటీ భారత కాలమానం ప్రకారం శుక్రవారం అర్ధరాత్రి ప్రారంభమైంది. శుక్రవారం రాత్రికే ఇరువురు నేతలు చర్చల ప్రాంతం అలాస్కాకు చేరుకున్నారు. చర్చలు ఆరు నుంచి ఏడు గంటలు జరిగే అవకాశం ఉందని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ తెలిపింది. ఈ సమావేశానికి ముందు మీడియాతో ట్రంప్ మాట్లాడుతూ ఈ భేటీ సజావుగా సాగకపోతే వాకౌట్ చేస్తానని అన్నారు. ఉక్రెయిన్‌లో యుద్ధం ఆపితేనే పుతిన్‌తో తాను వాణిజ్య చర్చలు జరుపుతానని, లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని అన్నారు. ఉక్రెయిన్‌పై ఒప్పందానికి పుతిన్ అంగీకరించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఫాక్స్ న్యూస్ రేడియోకి గురువారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్, ఈ చర్చలను చెస్ ఆటతో పోలుస్తూ వ్యాఖ్యలు చేశారు. శాంతి చర్చలు విఫలమవడానికి 25శాతం అవకాశాలు వున్నాయన్నారు. యుద్ధం ఆపేవరకు రష్యాతో వాణిజ్యం చేసే అవకాశం లేదని స్పష్టం చేశారు.

ఉక్రెయిన్‌లో సైనిక ఆపరేషన్ కారణంగా పశ్చిమ దేశాల ఆంక్షలతో రష్యాపై ఆర్థిక భారం పెరిగిపోతోంది. మరోవైపు ప్రపంచ శాంతి దూతగా మార్కులు కొట్టేయడానికి ట్రంప్ చెమటోడుస్తున్నారు. అలాస్కా సదస్సు కోసం ఆ ప్రాంతానికి చేరుకున్న పుతిన్ సానుకూల చర్యగా రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా - సోవియట్ సహకారానికి గుర్తుగా నిర్మించిన మెమోరియల్‌పై పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు.

ఆస్ట్రేలియా గడ్డపై మెరిసిన అమ్మాయిలు

- రెండో వన్డేలో రెండు వికెట్ల తేడాతో గెలుపు
- వన్డే సిరీస్ భారత్ కైవసం



బ్రిస్బేన్: ఇంగ్లండ్ గడ్డపై మెరిసిన భారత మహిళలు ఆస్ట్రేలియా-ఎతో జరిగిన వన్డే సిరీస్‌లోనూ రాణించారు. మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన రెండో వన్డేలోనూ గెలిచి మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఈ సిరీస్‌కు ముందు జరిగిన టి20 సిరీస్‌లో 0-3తో ఘోర పరాజయాన్ని చవిచూసిన భారత్-ఎ ఆ పరాభవానికి బదులు తీర్చుకుంది. బ్రిస్బేన్ వేదికగా శుక్రవారం జరిగిన రెండో వన్డేలో భారత్ 2 వికెట్ల తేడాతో ఆసీస్‌ను చిత్తుచేసింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్.. అలైస్సా హీలీ(91), కిమ్ గార్త్(41నాటౌట్) రాణించడంతో నిర్ణీత 50ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 265 పరుగులు చేసింది. భారత బౌలర్లలో మిన్ను మణి (3/46), సైమా ఠాకోర్ (2/30) కట్టడి చేశారు. రాధా యాదవ్, టైటాస్ సాధు, ప్రేమా రావత్, తనుజా కన్వర్ తలో వికెట్ తీశారు. అనంతరం 266 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన భారత్.. మరో బంతి మాత్రమే మిగిలుండగా 8 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. 193 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి ఓటమి కోరల్లో ఉన్న దశలో తనూజా కన్వర్(50), ప్రేమా రావత్ (32నాటౌట్) అద్భుతమైన పోరాట పటిమ కనబర్చి భారత్‌ను గెలిపించారు. అంతకు ముందు యస్తికా భాటియా(66), కెప్టెన్ రాధా యాదవ్(60) అర్ధసెంచరీలతో రాణించారు. ఆసీస్ బౌలర్లలో జార్జియా, యామీ ఎడ్గర్, హేవర్డ్ తలో రెండేసి వికెట్లు తీయగా.. కిమ్ గార్త్ ఓ వికెట్ దక్కించుకుంది. నామమాత్రపు మూడో వన్డే 17న జరగనుంది. అనంతరం ఇరుజట్ల మధ్య ఒక అనధికారిక టెస్ట్ మ్యాచ్ కూడా జరగనుంది. ఈ మ్యాచ్ ఆగస్ట్ 21న ప్రారంభమవుతుంది.

వెంకటేష్, త్రివిక్రమ్ సినిమా ప్రారంభం

వెంకటేష్ కొత్త సినిమాను ప్రారంభించారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమా షూటింగ్ శుక్రవారం ప్రారంభమైంది. త్వరలో రెగ్యూలర్ షూటింగ్ కూడా మొదలు కానుంది. వెంకటేశ్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఇప్పటికే రెండు సినిమాలు వచ్చాయి. నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరిలకు త్రివిక్రమ్ రైటర్‌గా పనిచేశారు. అయితే, ఈసారి త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకీ నటిస్తున్నారు. ఇందులో హీరోయిన్స్‌గా త్రిష, రుక్మిణీ వసంత్, నిధి అగర్వాల్, మీనాక్షి చౌదరి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. వారిలో ఇద్దరు నటించనున్నారు. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్‌పై ఎస్.రాధాకృష్ణ నిర్మించనున్న ఈ మూవీ వచ్చే ఏడాది వేసవిలో విడుదల కానుంది.

'జయహో భారత్' టైటిల్ విడుదల

నేస్తం క్రియేషన్స్ పతాకంపై మోహన్‌గౌడ్ జెవి దర్శకత్వంలో 'జయహో భారత్' అనే సినిమా త్వరలో ప్రారంభం కానుంది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారంనాడు ఆ చిత్ర దర్శకుడు మోహన్ గౌడ్ జెవి ఈ సినిమా టైటిల్‌ను విడుదల చేశారు. దేశం గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేయాలనే లక్ష్యంతో ఈ సినిమా తెరకెక్కుతుందన్నారు. యువత మెచ్చేలా మంచి సందేశాత్మక అంశాలతోపాటు ప్రేమ కథా చిత్రంగా రూపొందించబోతున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతిభ కలిగిన కళాకారులు, సాంకేతిక నిపుణులకు ఈ చిత్రం ద్వారా అవకాశం కల్పిస్తామన్నారు. త్వరలోనే అన్ని హంగులతో చిత్ర నిర్మాణం మొదలు పెడతామన్నారు. బిగ్‌బ్యాంగ్ శ్రీనివాస్ ప్రొడక్షన్ వ్యవహారాలను చూస్తారన్నారు.

30 శాతం వేతనాలు పెంచేవరకూ పోరాడతాం

సినిమారంగంలోని 24 క్రాఫ్ట్‌లోని కార్మికులకు 30 శాతం వేతనాల అగ్రిమెంట్ జరగే వరకూ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలుగు ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు వల్లభనేని అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అమ్మిరాజు కానుమిల్లి, కోశాధికారి అలెగ్జాండర్ స్పష్టంచేశారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లోని ఫెడరేషన్ కార్యాలయం ఎదుట జాతీయ జెండాను వారు ఆవిష్కరించి మాట్లాడారు. 30 శాతం అగ్రిమెంట్ చేసుకున్న సినిమాల షూటింగ్‌లను ఆపబోమన్నారు. చర్చలపేరుతో కాలయాపన చేయకుండా కార్మికుల న్యాయమైన డిమాండ్లను నిర్మాతలు అంగీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సినీరంగంలోని 24 క్రాఫ్ట్‌ల పరిధిలోని కార్మికులు పాల్గొన్నారు.

భీమవరం టాకీస్ 15 చిత్రాలు ప్రారంభం



భీమవరం టాకీస్ పతాకంపై నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ శుక్రవారం నాడు ఒకేసారి 15 చిత్రాలకు హైదరాబాద్‌లోని సారథి స్టూడియోలో షూటింగ్‌ను ప్రారంభించారు. మురళీమోహన్, రేలంగి నరసింహారావు, సుమన్, శ్రీకాంత్, జె.డి.చక్రవర్తి, తనికెళ్ళ భరణి, పృథ్వీ, అజయ్ ఘోష్, సి.కళ్యాణ్, తమ్మారెడ్డి భరద్వాజ, తుమ్మల ప్రసన్నకుమార్, చదలవాడ శ్రీనివాసరావు, భరత్ భూషణ్, వల్లూరిపల్లి రమేష్‌బాబు, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, ప్రముఖ రచయిత, రాజ్యసభ సభ్యులు విజయేంద్రప్రసాద్, కె.ఎల్ స్టూడియో అధినేత కొంతం లక్ష్మణ్; గజల్ శ్రీనివాస్, చీకటి ప్రవీణ్; ఇమ్మడి రమేష్, వంశీ రామరాజు, కె.ధర్మారావు, గిడుగు కాంతి కృష్ణ తదితరులు హాజరయ్యారు. జస్టిస్ ధర్మ, నాగపంచమి, నా పేరు పవన్ కళ్యాణ్, టాపర్, కెపిహెచ్‌బి కాలనీ, పోలీస్ సింహం, అవంతిక- 2, యండమూరి కథలు, బిసి (బ్లాక్ కమాండో), హనీ కిడ్స్, సావాసం, డార్క్ స్టోరీస్, మనల్ని ఎవడ్రా ఆపేది, ది ఫైనల్ కాల్, అవతారం సినిమాల షూటింగ్‌లు ప్రారంభమయ్యాయి. వచ్చే ఏడాది ఆగస్టు కల్లా ఈ సినిమాలు పూర్తవుతాయని రామ సత్యనారాయణ తెలిపారు.

'వందేమాతరం' చిత్రానికి ఎంపి శివనాథ్ అభినందన



భారత స్వాతంత్ర్య సమర ఘట్టాలను పట్టిచూపేలా తెరకెక్కిన 'వందేమాతరం' సినిమాను ప్రేక్షకులు ఆదరించాలని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) కోరారు. రత్నం మూవీ క్రియేషన్స్ ఆధ్వర్యంలో శోభన్ రాజా, సూర్యభాయ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'వందేమాతరం'.. విజయవాడలోని తన కార్యాలయంలో ఎంపి చిన్ని ఈ సినిమా ఊర్వశి ఓటీటీలో విడుదలైన పోస్టర్‌ను ఆవిష్కరించారు. నటీనటులను అభినందించారు.


బాలిక కిడ్నాప్

- రెండు గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి- ఒంగోలు సబర్బన్

కిడ్నాప్ అయిన బాలికను రెండు గంటల వ్యవధిలోనే రక్షించి తల్లిదండ్రుల చెంతకు చేర్చిన ఘటన ప్రకాశం జిల్లాలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం మువ్వవారిపాలేనికి చెందిన కుంచాల శ్రీనివాసులు, మాధవి దంపతు లకు కుమార్తె (13) ఉంది. కరోనా సమయంలో బతుకుదెరువు కోసం వీరు తిరుపతి వెళ్లారు. అక్కడ పరిచయం ఉన్న ఈశ్వర్‌రెడ్డి వద్ద కొంతమేర అప్పు చేశారు. ఇటీవల శ్రీనివాసుల కుటుంబం తిరిగి తమ స్వగ్రామానికి వచ్చారు. దీంతో అప్పు ఇచ్చిన వ్యక్తి శుక్రవారం చీమకుర్తికి వచ్చారు. విద్యానికేతన్ స్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న శ్రీనివా సులు కుమార్తెను ద్విచక్ర వాహనపై తీసుకెళ్లారు. ఒంగోలులో వాహనం ఆపకుండా తిరుపతి వైపు వెళ్లడంతో బాలిక ఏడవడం మొదలు పెట్టింది. దీంతో, ఈశ్వర్ రెడ్డి బాలిక తండ్రికి ఫోన్ చేసి 'మీ అమ్మాయిని తిరుపతి తీసుకువెళుతున్నాను, నాకు ఇవ్వాల్సిన బాకీ చెల్లించి, మీ అమ్మా యిని తీసుకెళ్లండి' అని బెదిరించాడు. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు చీమకుర్తి పోలీసులకు సమాచార మిచ్చారు. ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని, బాలికను రక్షిం చారు. నిందితుడిపై కిడ్నాప్ కేసు నమోదు చేశారు.

భారత్‌కు రానున్న రొనాల్డో



కోల్‌కతా: భారత ఫుట్‌బాల్ క్రీడాభిమానులకు శుభవార్త. ఫుట్‌బాల్ మాంత్రికుడు క్రిస్టియానో రొనాల్డో త్వరలోనే ఇండియాకు రానున్నాడు. తన ఆటతో మన ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నాడీ లెజెండ్. ఏఎఫ్‌సీ ఛాంపియన్స్ లీగ్ మ్యాచ్ కోసం ఈ స్టార్ ఫార్వర్డ్ రానున్నాడు. శుక్రవారం ఆసియా ఫుట్‌బాల్ సంఘం లీగ్ డ్రాలను ప్రకటించింది. మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లోని ఏఎఫ్‌సి హౌస్‌లో ఏఎఫ్‌సి ఛాంపియన్స్ లీగ్ 2025-26 సీజన్ డ్రా తీశారు. రొనాల్డో సారథ్యం వహిస్తున్న అల్ నస్రీ క్లబ్ గ్రూప్-డిలో ఉంది. అదే గ్రూప్‌లో ఇండియన్ సూపర్ లీగ్‌కు చెందిన ఎఫ్‌సి గోవా జట్టు కూడా ఉండడంతో ఈ వెటన్ ప్లేయర్ రాక అనివార్యం కానుంది. గ్రూప్-డిలో ఎఫ్‌సి గోవా, అల్ జవ్రా ఎఫ్‌సి(ఇరాక్), ఎఫ్‌సి ఇస్తిక్లోల్(తజకిస్థాన్) జట్లు ఉన్నాయి. రొనాల్డో కెప్టెన్సీలో అద్భుత విజయాలు సాధిస్తున్న అల్ నస్రీ క్లబ్ సౌదీ ప్రో లీగ్‌లో మూడో స్థానంతో ఈ లీగ్‌కు అర్హత సాధించింది. ఐఎస్ఎల్ 2024-25 లీగ్ సీజన్‌లో గోవా టీమ్ రెండో స్థానంలో నిలిచింది. మే నెలలో సూపర్ కప్‌లో విజేతగా నిలిచి ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చింది గోవా. అదే జోష్‌తో ఒమన్‌కు చెందిన అల్ సీబ్ జట్టును ఓడించి ఏఎఫ్‌సి ఛాంపియన్స్ లీగ్‌లో ఆడే అవకాశం దక్కించుకుంది.

చెన్నై గ్రాండ్ మాస్టర్స్ విజేత కెమెర్

అర్జున్‌కు రెండో స్థానం



చెన్నై: చెన్నై చెస్ గ్రాండ్‌మాస్టర్స్ టైటిల్‌ను జర్మనీ కుర్రాడు విన్సెంట్ కెమెర్ సొంతం చేసుకున్నాడు. ఈ టోర్నీలో మరో రౌండ్ మిగిలున్నప్పటికీ ఎనిమిదో రౌండ్ గేమ్‌ను డ్రా చేసుకున్న కెమెర్.. ఈ టోర్నీ మూడో సీజన్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. ఎనిమిదో రౌండ్‌లో అతడు.. జోర్డాన్ వాన్ ఫోరీస్ట్ (నెదర్లాండ్స్)తో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. 8వ రౌండ్ ముగిసేసరికి కెమెర్.. 6 పాయింట్లతో అగ్రస్థానాన్ని కొనసాగించాడు. రెండో స్థానంలో ఉన్న భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి.. ఎనిమిదో రౌండ్ గేమ్‌నూ డ్రా చేసుకోవడంతో అతడి ఖాతాలో 4.5 పాయింట్లే ఉన్నాయి.

మను బకర్‌పైనే ఆశలు

నేటినుంచి ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

షైమ్‌కెట్(కజకిస్తాన్): 16వ ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. భారత షూటింగ్ జట్టుకు పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన మను బకర్ సారథ్యం వహించనుంది. సరబ్‌జ్యోత్ సింగ్, సప్నిల్ కైశాలే గైర్హాజరీలో భారత షూటర్ల మహిళా జట్టు ఈ టోర్నీ బరిలో దిగుతోంది. శనివారం ప్రిలిమినరీ, క్వాలిఫికేషన్ రౌండ్‌లు, 18న ఫైనల్ జరగనుంది. ఎయిర్ రైఫిల్, 50మీ. రైఫిల్ 3పొజిషన్, ఎయిర్ పిస్టల్, 25మీ. ర్యాపిడ్ ఫైర్ పిస్టల్, ట్రాప్, స్కీట్ పురుషుల, మహిళల విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. ఇక మిక్స్‌డ్ విభాగంలో ఎయిర్ రైఫిల్, ఎయిర్ పిస్టల్, ట్రాప్ మిక్స్‌డ్ టీమ్, స్కీట్ మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో రేసులో ఉన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68